

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 339 | హైదరాబాద్ | ఆదివారం | 17-05-2026 | పేజీలు: 08


# తెలంగాణలో పాతికేళ్ల తర్వాత సర్ విప్లవం

**జూన్ 25 నుంచి ఇంటింటికీ ఓటర్ల సర్వే**
**కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల.**
**బోగస్, అనర్హుల ఓట్లకు శాశ్వతంగా చెక్**
**అర్హులందరికీ చోటు కల్పించడమే ప్రధాన లక్ష్యం.**
**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో**
**చివరిసారిగా 2002లో జరిగిన ప్రక్రియ**
**25 ఏళ్ల తర్వాత తెలంగాణలో తొలిసారి.**
**జూన్ 25 నుంచి జూలై 24 వరకు**
**నెల రోజుల పాటు వెరిఫికేషన్**
**ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా**
**కూడా స్వయంగా ఎన్యుమరేషన్**
**జూలై 31న ముసాయిదా (డ్రాఫ్ట్) నోటిఫికేషన్**
**ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు,**
**సవరణలకు అవకాశం.**
**అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురణ**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ల జాబితాను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ఎన్నికల సంఘం సిద్ధమైంది. బోగస్ ఓట్లను ఏరివేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియను చేపట్టనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ మెగా సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలను, షెడ్యూల్‌ను వెల్లడించారు. రాష్ట్రంలో దాదాపు పాతికేళ్ల (25 ఏళ్లు) సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ఈ సరికొత్త 'సర్' ప్రక్రియ జరగబోతోందని ..మిగతా 2లో

# కేంద్రం నిధులు ఇవ్వకున్నా ఇందిరమ్మ ఇండ్లు ఆగవు

రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందన్న మంత్రి పొంగులేటి
ఇందిరమ్మ ఇండ్ల పథకానికి కేంద్రం వాటా కోసం ఎదురుచూపులు
కేంద్రం నుంచి రావలసిన ఒక్కో ఇంటి వాటా రూ.1.13 లక్షలు
నిధుల నమ్మకంతోనే లబ్ధిదారుల ఫైనల్ బిల్లుల నిలిపివేత.
కేంద్రం నిధులు విడుదల చేయకుంటే రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని వెల్లడి.
జూన్ 2న ఆదిలాబాద్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించనున్న సీఎం
రాష్ట్రంలో దశాబ్దాలుగా నలుగుతున్న రెవెన్యూ, అటవీ భూములు
సరిహద్దు వివాదాలకు జాయింట్ సర్వేతో శాశ్వత పరిష్కారం.
రిజిస్ట్రేషన్ల సమయంలో సర్వర్ డౌన్ సమస్యకు రూ.14.08 కోట్లతో కొత్త సాఫ్ట్‌వేర్
34 నెలల్లో ఇబ్బందులు దూరం.
ఈ నెలాఖరు లోగా శాస్త్రీయ పద్ధతిలో రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ ధరల క్రమబద్ధీకరణ



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ప్రజాదరణ పొందిన 'ఇందిరమ్మ ఇండ్ల పథకం' లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన వాటా నిధులు ఇంకా విడుదల కాలేదని, వీటి కోసం తాము ఈ ఏడాది మార్చి నెల నుంచి నిరీక్షిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం సెక్రటేరియట్‌లోని తన ఛాంబర్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్ సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయనే నమ్మకంతోనే తాము ఇందిరమ్మ లబ్ధిదారులకు సంబంధించిన ఫైనల్ బిల్లులను తాత్కాలికంగా ఆపామని స్పష్టం చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం మరో 15 నుంచి 20 రోజుల్లోగా ఈ నిధులను ..మిగతా 2లో

# నిమ్స్‌లో కిడ్నీ రాకెట్..

**నిమ్స్‌లో కిడ్నీ రాకెట్ లేదన్న డైరెక్టర్ బీరప్ప**
**అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి మోసంతో మొదలైన వివాదం**
**డబ్బులు తీసుకున్న ఉద్యోగిపై వేటు.. పోలీసుల విచారణ**
**తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి**




**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (NIMS) ఆసుపత్రిలో కిడ్నీ రాకెట్, కిడ్నీ దందా సాగుతోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప స్పష్టం చేశారు. ప్రతిరోజూ వేలాది మంది, ఏటా లక్షలాది మంది పేద రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తూ ఎంతో మంచి పేరు సంపాదించుకున్న నిమ్స్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొంతమంది ఉద్దేశపూర్వకంగానే బురదజల్లుతున్నారని, ఇలాంటి తప్పుడు ప్రచారాలను ప్రజలు ఎవరూ నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ వివాదానికి గల అసలు కారణాన్ని డాక్టర్ బీరప్ప మీడియాకు ..మిగతా 3లో

# మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి అండ



**మహిళల అభివృద్ధే**
**సమాజ అభివృద్ధికి పునాది**
**స్త్రీనిధిని అందరం**
**కలిసి కాపాడుకోవాలి**
**మహిళల ఆర్థిక**
**శక్తివంతీకరణే లక్ష్యం**
**కొందరు స్త్రీనిధిపై తప్పుడు**
**ఆరోపణలు చేస్తున్నారు**
**ఆరోపణలు వచ్చిన**
**వెంటనే వెరిఫై చేసి చర్యలు**
**సంస్థ ప్రతిష్ట**
**దెబ్బతినకుండా జాగ్రత్తలు**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
ఉద్యోగులు హక్కులతో పాటు విధులు కూడా గుర్తుంచుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. స్త్రీనిధి సంస్థను అందరం కాపాడుకోవాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి తోడ్పాటు అందిస్తోందని వెల్లడించారు. మైక్రో ఫైనాన్స్ బాధల నుంచి మహిళలకు ..మిగతా 2లో



# ఆర్‌జీ కర్ ఘటనపై బంగాల్ ప్రభుత్వం ఉక్కుపాదం

**ముగ్గురు ఐపీఎస్ అధికారులపై వేటు**
**హత్యాచార కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం**
**ముగ్గురు సీనియర్**
**ఐపీఎస్ అధికారుల సస్పెండ్**
**ఘటనపై ముఖ్యమంత్రి**
**సువేందు అధికారి సీరియస్**
**ఎఫ్ఐఆర్ నమోదులో తీవ్ర అలసత్వం**
**బాధితురాలి కుటుంబానికి లంచం ఆరోపణలు**
**టీఎంసీ పాలనలో**
**రక్షకులే భక్షకులుగా మారారన్న సీఎం**
**మహిళల భద్రతకు భంగం**
**కలిగిస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం**
**ప్రెసిడెన్సీ జైల్లో ఖైదీలు మొబైల్ ఫోన్లు**
**వాడుతున్నట్లు గుర్తింపు**
**సూపరింటెండెంట్ సహా ఇద్దరు**
**ఉన్నతాధికారుల సస్పెన్షన్**
**జైలులో పది ప్రత్యేక బృందాలతో**
**నాలుగు గంటల పాటు దాడులు**
**23 మొబైల్ ఫోన్లు స్వాధీనం**
**చేసుకున్న డీజీ రమేశ్ బాబు**
**జైలు అక్రమాలపై సమగ్ర**
**విచారణ కోసం కేసు సీఐడీకి అప్పగింత**

**కోల్‌కత్తా, (ప్రజాక్షేత్రం):**
దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ హత్యాచార ఘటనపై పశ్చిమ బంగాల్‌లోని నూతన కూటమి ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. కేసు దర్యాప్తులో తీవ్ర నిర్లక్ష్యం వహించినట్లు నిర్ధారణ కావడంతో ముగ్గురు ..మిగతా 2లో

# డిజిటల్ చెల్లింపుల్లో అగ్రగామి భారత్

**నెదర్లాండ్స్ పర్యటనలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు**
**ది హేగ్ వేదికగా ప్రవాస భారతీయులతో ముచ్చట్లు**
**దేశంలో పండుగ గుర్తొచ్చిందన్న ప్రధాని మోదీ**
**డచ్ ఆర్థిక వ్యవస్థకు భారతీయుల సేవలపై ప్రశంసలు**
**కరోనా, యుద్ధాలు, ఇంధన సంక్షోభాలపై తీవ్ర ఆందోళన**
**భారత్-నెదర్లాండ్స్ సప్లై చైన్‌ను నిర్మిస్తాయని వెల్లడి**
**భారత్ నెలకు 20 బిలియన్ డాలర్ల లావాదేవీలు డిజిటల్**
**త్వరలోనే ప్రపంచ మార్కెట్లలో**
**'మేడ్ ఇన్ ఇండియా' సెమీకండక్టర్ చిప్‌లు**
**యూరప్ జనాభా కంటే భారత్‌లో ఓటు వేసిన వాళ్లే ఎక్కువ**
**భారత్ ప్రజాస్వామ్యానికి కన్నతల్లి లాంటిదన్న మోదీ**
**2014 మే 16న దేశంలో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడిందని వ్యాఖ్యలు**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆ దేశంలోని 'ది హేగ్' నగరంలో ప్రవాస భారతీయులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత దేశ ప్రగతి ప్రస్థానం, ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, భారత్‌నెదర్లాండ్స్ మధ్య ఉన్న దౌత్య సంబంధాలపై ఆయన ఎంతో కీలకమైన ప్రసంగం చేశారు. సభా ప్రాంగణానికి చేరుకున్న ప్రధానికి అక్కడ స్థిరపడిన భారతీయులు ఘన స్వాగతం పలికారు. ప్రవాస భారతీయులలో ..మిగతా 3లో

# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి

**ప్రధాని మోదీకి టీఆర్ఎస్**
**అధ్యక్షురాలు కవిత లేఖ**
**కేంద్ర మంత్రివర్గం నుంచి**
**బండి సంజయ్‌ను**
**తొలగించాలని డిమాండ్**
**కుమారుడిపై పోక్సో కేసు**
**నమోదు కావడమే ఇందుకు కారణం**
**హోం శాఖ మంత్రిగా ఉంటే దర్యాప్తు**
**ప్రభావితమవుతుందని ఆరోపణ**
**నిష్పక్షపాత విచారణ కోసం**
**బర్తరఫ్ చేయాలని విజ్ఞప్తి**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ను మంత్రివర్గం నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కె. కవిత ..మిగతా 2లో

# కేంద్రం నిధులు ఇవ్వకున్నా ఇందిరమ్మ ఇండ్లు ఆగవు



**మొదటిపేజీ తరువాయి**
విడుదల చేయకపోతే, లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకుండా ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరించి ఇండ్ల నిర్మాణ నిధులను అందజేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.

**కేంద్రం ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు**
కేంద్ర ప్రభుత్వం నుంచి ఒక్కో ఇందిరమ్మ ఇంటికి సుమారు ₹1,13,000 చొప్పున వాటా నిధులు విడుదల కావాల్సి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరించారు. ఇప్పటివరకు కేంద్రం నుంచి తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు కాలేదన్నారు. ఈ నిధుల సాధన కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో పాటు తాను కూడా పదే పదే కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి ప్రయత్నిస్తూనే ఉన్నామని చెప్పారు. అయినప్పటికీ లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రాష్ట్ర బడ్జెట్ నుంచైనా సరే నిధులు ఇచ్చి ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు.

**ఈనెల 21న క్యాబినెట్ భేటీ..**
**జూన్ 2 నుంచి రెండో విడత**
రాష్ట్రంలో మొదటి విడత కింద 3.50 లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా.. అందులో ఇప్పటివరకు సుమారు 1.32 లక్షల ఇండ్ల నిర్మాణాలు విజయవంతంగా పూర్తయ్యాయని మంత్రి వెల్లడించారు. రాబోయే జూన్ నెలాఖరు నాటికి మరో 68 వేల నుంచి 72 వేల ఇండ్ల శ్లాబుల నిర్మాణం కూడా పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇకపోతే, రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 2వ తేదీన ఆదిలాబాద్ జిల్లా వేదికగా అధికారికంగా ప్రారంభిస్తారని ప్రకటించారు. రెండో విడత మంజూరులో పేదలకు అనేక రకాల వెసులుబాట్లను కల్పిస్తున్నట్లు చెప్పారు. కేవలం ఖాళీ స్థలాలకే కాకుండా.. గతంలో సగం దూరంలో ఆగిపోయిన గోడలు, బేస్‌మెంట్ లెవెల్ పనులు, శ్లాబ్ వరకు గోడలు ఉండి శ్లాబ్ లేని ఇండ్లకు కూడా ఇందిరమ్మ పథకాన్ని వర్తింపజేస్తామన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి ఎన్ని ఇండ్లు మంజూరు చేయాలనే సంఖ్యను ఈనెల 21న జరిగే క్యాబినెట్ సమావేశంలో చర్చించి అధికారికంగా ప్రకటిస్తామని మంత్రి తెలిపారు.

**భూ వివాదాలకు జాయింట్**
**సర్వేతో శాశ్వత పరిష్కారం**
గత 25 రోజులుగా రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాల పరిధిలో రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, ల్యాండ్ సర్వే అంశాలపై తాము విస్తృతంగా సమీక్షా సమావేశాలు నిర్వహించామని మంత్రి పొంగులేటి చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన సలహాలు, సూచనలను స్వీకరించి చాలా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. ముఖ్యంగా, ఈసారి జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీఎఫ్ఓలతో ప్రత్యేకంగా సమావేశమై రెవెన్యూ మరియు అటవీ (ఫారెస్ట్) భూముల సరిహద్దు వివాదాలపై చర్చించామన్నారు. అత్యాధునిక 'రోవర్ల' సహాయంతో భూముల సరిహద్దుల గుర్తింపుపై అధికారులకు అవగాహన కల్పించామని, సరిహద్దులను ఖచ్చితంగా ఖరారు చేయాలని ఆదేశించామన్నారు. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ-ఫారెస్ట్ భూముల వివాదాల పరిష్కారానికి జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపబోతున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి సమగ్ర సర్వే చేపడతామని, 1/70 చట్టం సమస్యలపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టామని తెలిపారు.

**3-4 నెలల్లో రిజిస్ట్రేషన్ సర్వర్ల సమస్యకు చెక్**
రాష్ట్రవ్యాప్తంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల సమయంలో ఎదురవుతున్న సర్వర్ డౌన్ సమస్యపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ ఇబ్బందులను పూర్తిగా అధిగమించడానికి సరికొత్త అధునాతన సాఫ్ట్‌వేర్‌ను తీసుకువస్తున్నామని, ఇందుకోసం సుమారు ₹14.08 కోట్లతో టెండర్లు కూడా ఖరారయ్యాయని వెల్లడించారు. రాబోయే 34 నెలల కాలంలో ఈ కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వస్తుందని, ఆ తర్వాత సర్వర్ సమస్యలు పూర్తిగా తొలగిపోతాయని స్పష్టం చేశారు.

**అసంపూర్తి డబుల్ బెడ్‌రూమ్**
**ఇండ్ల బాధ్యత లబ్ధిదారులకే**
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి చేయడంపై మంత్రి కీలక ప్రకటన చేశారు. పాత కాంట్రాక్ట్ రేట్లతోనే మిగిలిన పనులను పూర్తి చేయాలని తాము కాంట్రాక్టర్లను కోరినప్పటికీ, ఎక్కువ శాతం మంది అందుకు ముందుకు రాలేదన్నారు. దీంతో ప్రభుత్వం ఒక ప్రత్యామ్నాయ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఆయా అసంపూర్తి ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసి, మిగిలిపోయిన నిర్మాణ నిధుల మొత్తాన్ని నేరుగా వారికే అందజేస్తామన్నారు. ఆ డబ్బుతో లబ్ధిదారులే స్వయంగా తమ ఇండ్లను పూర్తి చేసుకునేలా వీలు కల్పిస్తామని, ఈ నెలాఖరులోగా అసంపూర్తి ఇండ్లను గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించామన్నారు. అలాగే పదికి పైగా ఇండ్లు ఉన్న భారీ టవర్లను గుర్తించి వాటి నిర్వహణ కోసం ప్రత్యేక పాలకవర్గాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ టవర్ల దిగువ భాగంలో ఉండే కమర్షియల్ షాపులను లీజుకు ఇవ్వకుండా, బహిరంగ వేలంలో పూర్తిగా విక్రయించి.. ఆ సొమ్మును ప్రభుత్వ ప్రతినిధులు ఉండే పాలకవర్గం అకౌంట్‌లో వేసి, ఆ కాంప్లెక్స్ నిర్వహణకు వాడుకుంటామన్నారు.

**ఈ నెలాఖరు నాటికి**
**భూముల మార్కెట్ ధరల సవరణ**
రాష్ట్రంలో భూముల ప్రభుత్వ మార్కెట్ ధరలను సవరించాలని, కొన్ని ప్రాంతాల్లో వాస్తవ ధరలతో పోలిస్తే విపరీతంగా ఉన్న హెచ్చుతగ్గులను క్రమబద్ధీకరించాలని ఇటీవలి క్యాబినెట్ భేటీలో నిర్ణయించామని పొంగులేటి తెలిపారు. దీని ప్రకారం ఈ మే నెలాఖరు నాటికి భూముల కొత్త ధరలను సవరించి అమలులోకి తెస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2022లో కేవలం ఆరు నెలల వ్యవధిలోనే రెండుసార్లు అత్యంత అశాస్త్రీయ పద్ధతిలో భూముల ధరలను పెంచిందని విమర్శించారు. తాము మాత్రం ప్రముఖ ఆర్థిక నిపుణులైన అరవింద్ సుబ్రహ్మణ్యం కమిటీ ఇచ్చిన సలహాలు, సూచనల మేరకు ఎంతో శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించి మాత్రమే మార్కెట్ ధరలను సవరిస్తున్నామని చెప్పారు.

గత ప్రభుత్వం ఎన్నికల ముందు హైదరాబాద్ పరిసరాల్లో సుమారు 38 వేల ఇండ్లకు లబ్ధిదారులను ఖరారు చేసిందని, తాము అధికారంలోకి వచ్చాక ఏడాది పాటు శాస్త్రీయ సర్వే చేయించగా అందులో 16 వేల మంది అసలు ఆ ఇండ్లలోకి చేరలేదని తేలిందన్నారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఉంటూ ప్రతిరోజూ 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించలేని పేద ప్రజల ఇబ్బందులను గుర్తించి, వారు నివసించే ప్రాంతాల సమీపంలోనే ఇండ్లను కేటాయించాలని నిర్ణయించామన్నారు. అర్హులైన వారందరినీ ఎంపిక చేసి మౌలిక సదుపాయాలు కల్పించి యుద్ధప్రాతిపదికన ఇండ్లు అప్పగిస్తామని, జీహెచ్ఎంసీ పరిధిలోని మూడు కార్పొరేషన్లలో పేదలకు ఇండ్ల సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.

**వన్ ప్లస్ వన్ పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్లు**
పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో స్థలాల కొరతను అధిగమించడానికి ఒకే స్థలంలో అన్నదమ్ములు ఇందిరమ్మ ఇండ్లను 'వన్ ప్లస్ వన్' పద్ధతిలో పైఅంతస్తులో కట్టుకునేలా ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. అలాగే సుమారు 4050 ఏళ్ల క్రితం నిర్మించిన వాంబే, ఎన్ఆర్‌జేఎంఎస్ కాలనీల్లోని ఇండ్లు ప్రస్తుతం కూలిపోయే స్థితికి చేరాయని, వాటి స్థానంలో కూడా కొత్తగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఇండ్ల నిర్మాణానికి లబ్ధిదారులు స్థానికంగా ఉండే ఇసుకను, బేస్‌మెంట్ నింపుకోవడానికి (ఎర్త్ ఫిల్లింగ్) అవసరమైన మట్టిని ఉచితంగా పొందేలా చూడాలని, లబ్ధిదారులను అధికారులు ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకూడదని ఆదేశించారు. గతంలో ప్రైవేట్ భూములను సేకరించి వేసిన లేఅవుట్లలో కొన్ని ప్లాట్లు ఖాళీగా ఉండగా, మరికొన్ని కబ్జాకు గురయ్యాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. గత ధరణి పోర్టల్ లోపాల కారణంగా భూమి అమ్మేసిన పాత వ్యక్తి పేరిటే మళ్లీ రికార్డులు రావడంతో అనేక సమస్యలు మొదలయ్యాయన్నారు. దీనిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించామని, భూకబ్జాదారులను, ప్రభుత్వ భూములను అక్రమంగా అనుభవిస్తున్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అవసరమైన చోట్ల ప్రభుత్వ భూములకు చుట్టూ ప్రహరీ గోడలు నిర్మించి రక్షణ కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు.

# తెలంగాణలో పాతికేళ్ల తర్వాత 'సర్' విప్లవం



**మొదటిపేజీ తరువాయి**
ఆయన వివరించారు. వచ్చే నెల (జూన్) 15 నుంచి ఈ ప్రక్రియకు సంబంధించిన ప్రాథమిక పనులు ప్రారంభం కానున్నాయి.

**నెలకు పైగా ఇంటింటి వెరిఫికేషన్**
రాష్ట్రంలో క్షేత్రస్థాయి పరిశీలన కోసం జూన్ 25వ తేదీ నుంచి జూలై 24వ తేదీ వరకు నెల రోజుల పాటు ముమ్మరంగా ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ (DoortoDoor Verification) నిర్వహిస్తామని సుదర్శన్ రెడ్డి తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) నేరుగా ప్రతి ఇంటినీ సందర్శించి, అక్కడ నివసిస్తున్న ఓటర్ల వివరాలను సేకరిస్తారని చెప్పారు. ఈ క్రమంలో ప్రతి ఓటరుకూ రెండేసి చొప్పున 'ఎన్యుమరేషన్ ఫామ్‌లు' (గణన పత్రాలు) అందజేస్తారు. ఓటరు అందులో ఒక ఫామ్‌ను పూర్తిగా భర్తీ చేసి తిరిగి బీఎల్ఓకు అప్పగించాల్సి ఉంటుంది. రెండో ఫామ్‌ను ఓటరు భవిష్యత్తు అవసరాల కోసం అక్నాలెడ్జ్‌మెంట్ (రసీదు) కార్డుగా తన వద్దే భద్రపరుచుకోవచ్చని సీఈఓ స్పష్టం చేశారు.

**వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్ ఎన్యుమరేషన్**
ఇంటికి వచ్చే అధికారులకు ఫారాలు ఇవ్వడమే కాకుండా, సాంకేతికతను ఉపయోగించుకుని ప్రజలు స్వయంగా ఆన్‌లైన్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు ఎన్నికల ప్రధాన అధికారి వెల్లడించారు. ఓటర్లు కేంద్ర ఎన్నికల సంఘానికి చెందిన అధికారిక వెబ్‌సైట్ *voters.eci.gov.in* లోకి లాగిన్ అయి తమ వివరాలను సులభంగా నమోదు చేసుకోవచ్చని సూచించారు. ఇలా సేకరించిన పూర్తి డేటాను, దరఖాస్తులను క్రోడీకరించి, వాటి ఆధారంగా అధికారులు ఓటర్ల ముసాయిదా జాబితా (డ్రాఫ్ట్ నోటిఫికేషన్)ను సిద్ధం చేస్తారు.

**అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా**
ఈ 'సర్' ప్రక్రియ ద్వారా రూపొందించిన ఓటరు ముసాయిదా జాబితాను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించడంతో పాటు, ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోనూ ప్రజల పరిశీలన కోసం అందుబాటులో ఉంచుతామని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై జూలై 31వ తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు రాజకీయ పార్టీలు లేదా సాధారణ ప్రజలు ఎవరైనా తమ అభ్యంతరాలను, సవరణలను దాఖలు చేయవచ్చని తెలిపారు. వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులను సరిదిద్దిన తర్వాత.. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీన తెలంగాణ రాష్ట్ర అధికారిక తుది ఓటరు జాబితాను ప్రచురిస్తామని డేట్‌లైన్ ప్రకటించారు.

**2002 తర్వాత ఇప్పుడే..**
రాష్ట్రంలో చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో, 2002వ సంవత్సరంలో ఈ తరహా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరిగిందని సీఈఓ సుదర్శన్ రెడ్డి గుర్తుచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఇంత పెద్ద ఎత్తున, సమగ్రంగా ఓటర్ల గణన జరగడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఓటర్ల జాబితాలో చనిపోయిన వారి పేర్లు, ఒకే వ్యక్తికి రెండు మూడు చోట్ల ఓట్లు ఉండటం (డూప్లికేట్), శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి వివరాలు అలాగే ఉండిపోవడం వల్ల ఎన్నికల సమయంలో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. అలాంటి అనర్హులైన, నకిలీ ఓటర్లందరినీ జాబితా నుంచి పూర్తిగా తొలగించి, ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేయడమే ఈ 'సర్' కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తమ ఓటును

# ఆర్‌జీ కర్ ఘటనపై బెంగాల్ ప్రభుత్వం ఉక్కుపాదం



**మొదటిపేజీ తరువాయి**
ఉన్నత స్థాయి ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారులపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ముఖ్యమంత్రి సువేందు అధికారి నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశంగా మారింది. బాధితురాలికి న్యాయం చేయడంలో ఎటువంటి రాజీ పడే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ఈ చర్య ద్వారా స్పష్టం చేశారు.

**విచారణలో లోపాలు.. లంచం ఆరోపణలు**
కోల్‌కతాలోని రాష్ట్ర సచివాలయం (నబన్నా)లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి సువేందు అధికారి స్వయంగా ఈ వివరాలను వెల్లడించారు. ఆర్‌జీ కర్ ఘటన జరిగిన సమయంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో తీవ్రమైన పరిపాలనా లోపాలు జరిగాయని, దర్యాప్తును పక్కదారి పట్టించేలా వ్యవహరించారని ఆయన మండిపడ్డారు. దీనితో పాటు బాధితురాలి కుటుంబ సభ్యులను ప్రలోభపెట్టేందుకు, కేసును అణచివేయడానికి లంచాలు ఇవ్వజూపినట్లు అధికారులపై తీవ్ర ఆరోపణలు వచ్చాయని చెప్పారు. ఈ నేపథ్యంలోనే సీనియర్ ఐపీఎస్ అధికారులు వినీత్ గోయల్, ఇందిరా ముఖర్జీ, అభిషేక్ గుప్తాలను తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ ముగ్గురిపై శాఖాపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

**రక్షకులే భక్షకులుగా మారారు: సీఎం**
గత తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని సువేందు అధికారి విమర్శించారు. "గత ప్రభుత్వ పాలనలో ప్రజలను కాపాడాల్సిన రక్షకులే భక్షకులుగా మారారు. పోలీస్, పరిపాలనా విభాగాల్లోని కొందరు అధికారులు నేరస్థులతో చేతులు కలిపి సమాంతర వ్యవస్థను నడిపారు. ఈ దుర్మార్గపు నెట్‌వర్క్‌ను పూర్తిగా అంతమొందించడమే మా ప్రభుత్వ లక్ష్యం" అని సీఎం స్పష్టం చేశారు. 'అభయ'పై జరిగిన దారుణం యావత్ దేశాన్ని, రాష్ట్రాన్ని కుదిపేసిందని, ఇలాంటి సంఘటనల విషయంలో తమ ప్రభుత్వం ఏమాత్రం సహించదని చెప్పారు. పారదర్శకమైన, నిష్పక్షపాతమైన విచారణ కోసమే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిపారు.

**జైలులో ఆకస్మిక దాడులు..**
**23 ఫోన్లు స్వాధీనం**
ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జైళ్ల శాఖ అధికారులు, కోల్‌కతా పోలీసులు కలిసి ప్రెసిడెన్సీ జైలులో భారీ ఎత్తున తనిఖీలు చేపట్టారు. కరెక్షనల్ హోమ్స్ డీజీ ఎన్. రమేశ్ బాబు పర్యవేక్షణలో 10 ప్రత్యేక బృందాలు జైలు ఆవరణలో దాదాపు నాలుగు గంటల పాటు అంగుళం అంగుళం సోదాలు నిర్వహించాయి. ఈ ఆకస్మిక దాడుల్లో ఖైదీలు దాచి ఉంచిన 23 మొబైల్ ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అత్యంత భద్రత ఉండే జైలు లోపలికి ఇన్ని ఫోన్లు ఎలా వచ్చాయి? వీటికి సహకరించిన లోపలి వ్యక్తులు ఎవరు? ఖైదీలు ఈ ఫోన్ల ద్వారా బయట ఎవరితో సంప్రదింపులు జరుపుతున్నారు? అనే కోణంలో సీఐడీ విచారణ జరుపుతుందని డీజీ రమేశ్ బాబు మీడియాకు వివరించారు.

**దేశాన్ని కుదిపేసిన ఆర్‌జీ కర్ దారుణం**
2024 ఆగస్టు 9వ తేదీ రాత్రి కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో విధుల్లో ఉన్న ఒక యువ మహిళా డాక్టర్‌పై అత్యంత ఘోరంగా హత్యాచారం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా వైద్యులు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపారు. అప్పట్లో ఈ కేసు దర్యాప్తు తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆసుపత్రిలోని సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడు సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టు అన్ని సాక్ష్యాధారాలను పరిశీలించి, నిందితుడు సంజయ్ రాయ్‌ను దోషిగా నిర్ధారిస్తూ అతనికి జీవిత ఖైదు విధిస్తూ తుది తీర్పునిచ్చింది.

**ఎన్నికల్లో బాధితురాలి తల్లి ఘన విజయం**
ఈ హత్యాచార ఘటన బెంగాల్ రాజకీయాల్లో కూడా పెద్ద కుదుపు తెచ్చింది. ఇటీవలే జరిగిన పశ్చిమ బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్‌జీ కర్ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధితురాలి తల్లి రత్నా దేవనాథ్‌ను పానీహట్ నియోజకవర్గం నుంచి బరిలోకి దించింది. కూతురికి న్యాయం కోసం పోరాడిన ఆమెకు ప్రజలు అఖండ మద్దతు పలికారు. ఈ ఎన్నికల్లో రత్నా దేవనాథ్ తన ప్రత్యర్థి, అధికార టీఎంసీ అభ్యర్థి తీర్థంకర్ ఘోష్‌పై 28 వేల ఓట్లకు పైగా భారీ మెజారిటీతో ఘన విజయం సాధించి శాసనసభలో అడుగుపెట్టారు. ఈ నేపథ్యంలోనే అధికారంలోకి వచ్చిన సువేందు అధికారి ప్రభుత్వం.. పాత కేసులో నిర్లక్ష్యం వహించిన అధికారులపై చకచకా చర్యలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**జైళ్లలో అక్రమాలపై**
**సీఎం సీరియస్**

రాష్ట్రంలో కేవలం పోలీస్ వ్యవస్థలోనే కాకుండా, జైళ్ల శాఖలో జరుగుతున్న అక్రమాలపై కూడా సీఎం సువేందు అధికారి గట్టిగా దృష్టి పెట్టారు. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కరెక్షనల్ హోమ్ (జైలు)లో ఉన్న ఖైదీలు పెద్ద ఎత్తున మొబైల్ ఫోన్లు వాడుతున్నట్లు తమకు బాధితుల బంధువుల నుంచి ఫిర్యాదులు అందాయని ఆయన పేర్కొన్నారు. జైలు నిబంధనలను ఉల్లంఘించి ఖైదీలకు సదుపాయాలు కల్పించడంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలనా నిర్లక్ష్యానికి బాధ్యులుగా చేస్తూ ప్రెసిడెన్సీ జైలు సూపరింటెండెంట్ ఎన్. కుజూర్, చీఫ్ కంట్రోలర్ దీప్తా ఘోరాయ్‌లను వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. జైలులో మొబైల్ ఫోన్ల వాడకంపై సమగ్ర విచారణ జరిపేందుకు ఈ కేసును క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)కి అప్పగిస్తున్నట్లు వెల్లడించారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి అండ



**మొదటిపేజీ తరువాయి**
విముక్తి కోసం స్త్రీనిధి ఏర్పాటయిందని తెలిపారు. ఇప్పటివరకు రూ.24 వేల కోట్ల రుణాలు పంపిణీ చేసిన స్త్రీనిధి అని చెప్పారు. 32 లక్షల మహిళలకు రుణాలు అందించిందని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళలకు నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణ స్త్రీనిధి మోడల్‌ను అనుసరిస్తున్నాయని.. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్న స్త్రీ నిధి బ్యాంక్‌పై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ఆరోపణలు వస్తే వెంటనే వెరిఫై చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అప్పుడు ఆరోపణలతో సంస్థ ప్రతిష్ట దెబ్బతినకూడదని మంత్రి వివరించారు. మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధికి పునాది అని చెప్పారు.

“చిన్న వ్యాపారాలు, గృహాధారిత ఉపాధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది. ఆదివాసీ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నాం. స్త్రీనిధి మహిళల కోసం మహిళల ఆధ్వర్యంలో నడిచే సంస్థ. స్త్రీనిధిని కాపాడుకోవాలి. ఉద్యోగ అనుకూల ప్రభుత్వం మా ప్రభుత్వం. స్త్రీ నిధి ఏర్పాటులో, దాన్ని విజయవంతం చేయడంలో కృషిచేసిన విద్యాసాగర్ రెడ్డికి అభినందనలు. నూతన నాయకత్వంలో ఈ సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.” అని మంత్రి సీతక్క వెల్లడించారు.

# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయండి

**మొదటిపేజీ తరువాయి**
డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ప్రధాని మోదీకి ఒక లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడమే కవిత డిమాండ్‌కు ప్రధాన కారణం.

"కేంద్ర మంత్రివర్గ కూర్పుకు సంబంధించిన చట్టపరమైన నైతికత, ప్రజా విశ్వాసం వంటి కీలక అంశాలను మీ దృష్టికి తీసుకువచ్చేందుకే ఈ లేఖ రాస్తున్నాను" అని కవిత ప్రధానిని ఉద్దేశించి పేర్కొన్నారు. చట్టాన్ని అమలు చేసే యంత్రాంగాలపై అధికారం కలిగిన హోం శాఖ వంటి అత్యంత కీలకమైన శాఖలో బండి సంజయ్ కొనసాగడం వల్ల కేసు దర్యాప్తు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

మైనర్‌పై లైంగిక దాడి ఆరోపణలకు సంబంధించిన ఈ కేసులో దర్యాప్తు, తదుపరి విచారణ పూర్తి స్వాతంత్ర్యంతో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని కవిత తన లేఖలో నొక్కిచెప్పారు. న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని కాపాడాలంటే, ఈ కేసుపై ఎలాంటి రాజకీయ ప్రభావం ఉండకూడదని ఆమె అభిప్రాయపడ్డారు.

"అందువల్ల ఈ కేసులో విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి పదవి నుంచి తొలగించాలని నేను మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను" అని కవిత కోరారు. ఈ చర్య ద్వారా మైనర్ల భద్రతకు, న్యాయానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న బలమైన సందేశం ప్రజల్లోకి వెళుతుందని ఆమె పేర్కొన్నారు.

17 ఏళ్ల బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 8న బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు.

# నేటి నుండి సెంట్రింగ్ పనులు బంద్

**శంకర్ పల్లి మే 16(ప్రజాక్షేత్రం):**
రాష్ట్ర సెంట్రింగ్ యూనియన్ పిలుపు తో నేటి రాష్ట్ర వ్యాప్తంగా సెంట్రింగ్ పనులు బంద్ చేయడం జరుగుతుంది అని శంకర్ పల్లి సెంట్రింగ్ యూనియన్ అధ్యక్షులు కంకంటి జంగయ్య కుర్మ , వైస్ ప్రెసిడెంట్ నాగరాజులు తెలిపారు, ఈసందర్బంగా యూనియన్ ఆధ్వర్యంలో శంకర్ పల్లి మున్సిపల్ చేర్మెన్ సాత ప్రవీణ్ కుమార్ కు శంకర్ పల్లి సీఐ మీర్ ముద్దసిర్ అలీ, ఎస్ ఐ సురేష్ లకు పనులు నిలిపివేస్తున్నట్లు వినతి పత్రం ఇచ్చారు, ఈసందర్బంగా మాట్లాడుతు గత పది ఏండ్ల నుండి ఒకే రేటు నడుస్తుంది కాని లేబర్ రేటు మాత్రం రెండు ఇంతలు పెరగడంతో సెంట్రింగ్ వారికీ తీవ్ర నష్టాలు ఎదుర్కొంటోన్నారు, దింతో ఒక ఫిట్ 150 రూపాయలు చేసే వరకు ఈ ఉద్యమం ఆగదని అన్నారు. కార్యదర్శి శేఖర్ రెడ్డి, కోశాధికారి వేమారెడ్డి, సలహాదారులు మల్లేష్, బాలరాజ్, బిక్షపతి, శ్రీనివాస్, కృష్ణ, రైటర్ కృష్ణ, బి శ్రీనివాస్ కే కృష్ణ, పోచయ్య, బంధయ్య గౌడ్, ఆగమయ్య తదితరులు పాల్గొన్నారు.



# డిజిటల్ చెల్లింపుల్లో అగ్రగామి భారత్

**మొదటిపేజీ తరువాయి**

కనిపించిన ఉత్సాహాన్ని చూస్తుంటే తాను భారతదేశంలోని ఏదో ఒక పెద్ద పండుగలో పాల్గొన్నట్లుగా అనిపిస్తోందని ప్రధాని మోదీ ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. నెదర్లాండ్స్ దేశ అగ్ర నాయకత్వంతో తాను ఎప్పుడు మాట్లాడినా.. వారు ఇక్కడి భారతీయుల కష్టపడే తత్వాన్ని, వారి ప్రతిభను ఎంతో గొప్పగా ప్రశంసిస్తారని గుర్తుచేశారు. డచ్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మనవాళ్లు అందిస్తున్న సేవలను చూసి ప్రతి భారతీయుడు గర్వపడాలన్నారు.

**భారతీయ సంస్కృతి, విలువలు మారవు**

ది హేగ్ నగరం భారత్‌నెదర్లాండ్స్ దేశాల స్నేహానికి ఒక సజీవ చిహ్నంగా మారిందని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఎన్నో ఏళ్ల క్రితం ఎన్నో కష్టనష్టాలను ఓర్చుకుని ఇక్కడ స్థిరపడిన భారతీయ కుటుంబాల కథలు కేవలం వలసల కథలు మాత్రమే కావని, అవి వారి ఆత్మవిశ్వాసానికి, సాధించిన అభివృద్ధికి నిదర్శనాలని చెప్పారు. కాలం గడిచి తరాలు మారినా, దేశాలు మారినా కూడా భారతీయ కుటుంబాల విలువలు, మన సంస్కృతి సంప్రదాయాలు అస్సలు మారలేదని ఆయన కొనియాడారు. ఇక్కడి జీవనశైలికి అలవాటు పడి, డచ్ భాషను పూర్తిగా నేర్చుకున్నప్పటికీ.. తమ మూల భాషలను, భారతీయ పండుగలను ప్రవాస భారతీయులు మర్చిపోకుండా గుండెల్లో దాచుకున్నారని అభినందించారు.

**ప్రపంచానికిది విపత్తుల దశాబ్దం**

ప్రస్తుత కాలంలో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు తీవ్రమైన సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయని ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. మొదట కరోనా మహమ్మారి వచ్చి ప్రపంచాన్ని అతలాకుతలం చేసిందని, ఆ తర్వాత దేశాల మధ్య యుద్ధాలు ప్రారంభమయ్యాయని, ఇప్పుడు ఇంధన (ఆయిల్, గ్యాస్) సంక్షేమం ప్రపంచాన్ని వేధిస్తోందని ఆయన వివరించారు. ఈ పరిణామాలను చూస్తుంటే ప్రస్తుత దశాబ్దం ప్రపంచానికి ఒక విపత్తుల (డిజాస్టర్ల) దశకంగా మారుతోందని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయంగా పరిస్థితులు గనుక త్వరగా మారకపోతే, ప్రపంచ దేశాలు గత కొన్ని దశాబ్దాలుగా సాధించిన అభివృద్ధి ఫలితాలన్నీ ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం ఉందనన్నారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా భారీ సంఖ్యలో ప్రజలు మళ్లీ పేదరికంలోకి జారిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.

**బలమైన సరఫరా వ్యవస్థ కోసం భాగస్వామ్యం**

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రపంచ దేశాలన్నీ నమ్మకమైన సరఫరా వ్యవస్థ (రెసిలియెంట్ సప్లై చైన్) వైపు చూస్తున్నాయని ప్రధాని తెలిపారు. ఈ క్రమంలోనే భారత్, నెదర్లాండ్స్ దేశాలు కలిసి భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎంతో నమ్మకమైన, పారదర్శకమైన సరఫరా వ్యవస్థను రూపొందించేందుకు చేతులు కలిపాయని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వం తీసుకురావడానికి రెండు దేశాలు తమ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటున్నాయని వెల్లడించారు. 21వ శతాబ్దంలో భారతదేశం ప్రపంచానికి ఒక అపారమైన అవకాశాల భూమిగా ఎదుగుతోందని ప్రధాని పేర్కొన్నారు. భారత్ ఒకవైపు సరికొత్త టెక్నాలజీతో దూసుకుపోతూనే, మరోవైపు మానవీయ విలువలను కాపాడుకుంటూ సమతుల్యంగా ముందుకు సాగుతోందన్నారు. మన దేశం ఎంత పురాతనమైనదో, అంతే ఆధునికంగా కూడా మారుతోందని వ్యాఖ్యానించారు.

**డిజిటల్ చెల్లింపులు, సెమీకండక్టర్లలో నంబర్ వన్**

ఆన్‌లైన్ డిజిటల్ చెల్లింపుల్లో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని ప్రధాని మోదీ గర్వంగా ప్రకటించారు. ప్రస్తుతం మన దేశంలో కేవలం ఒక్క నెలలోనే దాదాపు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ లావాదేవీలు జరుగుతున్నాయని చెప్పి డచ్ ప్రజలను ఆశ్చర్యపరిచారు. వ్యాపార, స్టార్టప్ రంగంలోనూ భారత్ శరవేగంగా ఎదుగుతోందని, ఒకప్పుడు దేశంలో కేవలం నాలుగు యూనికార్న్ కంపెనీలు మాత్రమే ఉండగా, ఇవాళ వాటి సంఖ్య 100 దాటిందని వెల్లడించారు. ప్రపంచమంతా కొరతగా ఉన్న సెమీకండక్టర్ (చిప్స్) రంగంలో భారత్ ఒక విప్లవాత్మక ముందడుగు వేసిందని స్పష్టం చేశారు. దేశంలో ఇప్పటికే పలు భారీ సెమీకండక్టర్ ప్లాంట్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే 'మేడ్ ఇన్ ఇండియా' ట్యాగ్‌తో తయారైన చిప్‌లు ప్రపంచవ్యాప్త మార్కెట్లలో సందడి చేయబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.

**ప్రపంచ ప్రజాస్వామ్యానికి భారతే కన్నతల్లి**

అంతర్జాతీయ వేదికలపై భారతదేశం యొక్క గౌరవం, ప్రతిష్ఠ రోజురోజుకూ పెరుగుతున్నాయని ప్రధాని మోదీ చెప్పారు. గ్లోబల్ ఏఐ సమ్మిట్, జీ20 వంటి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశాలను భారత్ ఎంతో విజయవంతంగా నిర్వహించి తన సత్తా చాటుకుందన్నారు. ప్రపంచ దేశాల సమస్యల పరిష్కారంలో నేడు భారత్ ఒక కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క బలాన్ని వివరిస్తూ.. ప్రస్తుతం దేశంలో 90 కోట్ల మందికి పైగా ఓటర్లుగా నమోదై ఉన్నారని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో 64 కోట్ల మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని వెల్లడించారు. మొత్తం యూరప్ దేశాల జనాభాను కలిపినా కూడా ఈ 64 కోట్లకు సమానం కాదంటూ భారత ప్రజాస్వామ్య విస్తృతిని ప్రధాని వివరించారు. అందుకే ప్రపంచానికి, ప్రజాస్వామ్యానికి భారతదేశం మాతృదేశం (మదర్ ఆఫ్ డెమోక్రసీ) అని గర్వంగా చెబుతామన్నారు.



**మే 16 నా జీవితంలో ఎప్పటికీ ప్రత్యేకమే**

తన రాజకీయ జీవితంలో మే 16వ తేదీకి ఎంతో ప్రత్యేకత ఉందని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం, అంటే 2014 మే 16న దేశ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయని, ఆ రోజే దేశంలో ఒక స్థిరమైన, పూర్తి మెజార్టీ గల ప్రభుత్వం ఏర్పడిందని చెప్పారు. దేశ ప్రజలు తనపై ఉంచిన నమ్మకమే తనకు అన్నిటికంటే పెద్ద బలమని పేర్కొన్నారు. "నేను నా జీవితంలో 'నేను' అనే స్వార్థం నుంచి 'మనము' అనే విశాలమైన మార్గాన్ని ఎంచుకున్నాను. మీ అందరి సంతోషమే నా సంతోషం, మీ దేశాభివృద్ధే నా బాధ్యత" అని ప్రధాని ప్రవాస భారతీయులను ఉద్దేశించి భావోద్వేగంగా మాట్లాడారు. గతంలో 13 సంవత్సరాల పాటు ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత 12 సంవత్సరాలుగా దేశానికి ప్రధానమంత్రిగా కోట్లాది మంది ప్రజల మద్దతు, ప్రేమను పొందడం తన అదృష్టమని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. దేశ విదేశాల్లో ఉన్న కోట్లాది మంది భారతీయుల ఆశీర్వాదమే తనకు నిరంతరం దేశం కోసం పనిచేసే శక్తిని ఇస్తోందని ప్రధాని తన ప్రసంగాన్ని ముగించారు.




# నిమ్స్‌లో 'కిడ్నీ రాకెట్'..

**మొదటిపేజీ తరువాయి**

వివరించారు. నిమ్స్ ఆసుపత్రిలో పనిచేసే ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి, ఒక రోగికి కిడ్నీ ఆపరేషన్ చేయిస్తానని నమ్మించి వ్యక్తిగతంగా డబ్బులు వసూలు చేసినట్లు ఆసుపత్రి యాజమాన్యానికి రాతపూర్వక ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించిన యాజమాన్యం, ప్రాథమిక విచారణ జరిపి సదరు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని తక్షణమే విధుల్లో నుంచి తొలగించిందని ఆయన వెల్లడించారు. ఈ వ్యవహారంపై పంజాగుట్ట పోలీసులు ప్రస్తుతం సమగ్ర విచారణ జరుపుతున్నారని పేర్కొన్నారు.

కేవలం ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి వ్యక్తిగతంగా చేసిన మోసాన్ని, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దాన్ని చిలువలు పలువలు చేసి 'నిమ్స్‌లో కిడ్నీ రాకెట్' అంటూ ఒక పెద్ద దందాలాగా సోషల్ మీడియాలో చిత్రీకరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఇమేజ్‌ను దెబ్బతీసేలా అసత్య ప్రచారాలు చేస్తున్న వారి అంశాన్ని కూడా ఇప్పటికే పోలీసుల దృష్టికి తీసుకెళ్లామని, ఈ ఘటనలో ఇంకెవరి పాత్ర అయినా ఉన్నట్లు విచారణలో తేలితే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమాజంలో నిమ్స్ ఆసుపత్రిపై ప్రజలకున్న నమ్మకాన్ని వమ్ము చేయడానికే కొందరు ఇలాంటి అపోహలను సృష్టిస్తున్నారని, కాబట్టి మీడియా మిత్రులు కూడా ఇటువంటి దురుద్దేశపూర్వక ప్రచారాల పట్ల అప్రమత్తంగా ఉంటూ వాస్తవాలను మాత్రమే ప్రజల్లోకి తీసుకెళ్లాలని డాక్టర్ బీరప్ప కోరారు.



# రైస్‌మిల్లులో ఆకస్మిక తనిఖీ

- **లోడింగ్, అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని ఆదేశం**
- **రికార్డుల్లో అవకతవకలు లేవన్న ఎంపీడీవో జలంధర్‌రెడ్డి**

**వలిగొండ, మే 16(ప్రజా క్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం నాగారం గ్రామంలోని వాసవి రైస్‌మిల్లును వలిగొండ ఎంపీడీవో జి. జలంధర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో జరుగుతున్న లోడింగ్, అన్‌లోడింగ్ ప్రక్రియలను పరిశీలించిన ఆయన వాటిని మరింత వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. స్టాక్ రిజిస్టర్, ట్రాన్స్‌పోర్టేషన్ లాగ్‌బుక్ రిజిస్టర్లను పరిశీలించగా ఎలాంటి అవకతవకలు లేవని గుర్తించినట్లు తెలిపారు. రోజువారీ సీరియల్ నంబర్, లారీ టోకెన్ ప్రకారం అన్‌లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# అరూరులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

- **ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో విడుదల**
- **లబ్ధిదారులకు అందజేసిన కాంగ్రెస్ నాయకులు**

**వలిగొండ, మే 16(ప్రజా క్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అరూరు గ్రామానికి చెందిన పలువురు అనారోగ్యంతో చికిత్స పొందిన నేపథ్యంలో వారి వైద్య ఖర్చుల నిమిత్తం విడుదలైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బుర్ర నరసింహా యాదవ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నల్ల నవీన్‌కు రూ.16,900, చిలకమర్రి సత్యంకు రూ.34 వేల, ఆముద శంకరయ్యకు రూ.25 వేల, పన్నాల వీణకు రూ.20 వేల, తుడుమెళ్ళ ప్రకృతంకు రూ.60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వేముల అనిల్, కసిరబోయిన నరసింహ తదితరులు పాల్గొన్నారు.




# గర్భిణీ స్త్రీలకు బాలింతలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం...

- **గ్రామాల్లో అంగన్వాడీ సేవలు చాలా కీలకం...**
- **లంబడిపల్లె అంగన్వాడి సెంటర్ ను సందర్శించిన జిల్లా సంక్షేమ శాఖ అధికారి సరస్వతి...**

**చిగురుమామిడి, మే 16 (ప్రజాక్షేత్రం) :**

గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు, చిన్నారి పిల్లలకు ప్రభుత్వం నుండి అందాల్సిన మెనులో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని,త్వరలోనే పూర్తిస్థాయిలో టీచర్లను భర్తీ చేస్తామని కరీంనగర్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి సరస్వతి తెలిపారు.శనివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లే గ్రామంలో గత పది సంవత్సరాల నుంచి అంగన్వాడీ టీచర్ పోస్ట్ ఖాళీగా ఉందని,రెండు సంవత్సరాల నుండి అంగన్వాడి ఆయా లేకపోవడంతో చాలా ఇబ్బంది అవుతుందని సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్,జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడంతో డిడబ్ల్యు ఓ సరస్వతి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి,గ్రామస్తులతో మాట్లాడారు.గ్రామాల్లో అంగన్వాడీ సేవలు చాలా కీలకమని,బిడ్డ కడుపులో పడ్డప్పటినుండి గర్భిణీ స్త్రీలను, బాలింతలను,పిల్లలను సంరక్షించే ఎంతో ఉన్నతమైన డిపార్ట్మెంట్ అంగన్వాడి వ్యవస్థ అని వారు పేర్కొన్నారు. లంబాడి పల్లెకు తాత్కాలికంగా చిగురుమామిడి నుండి ఇద్దరు అంగన్వాడీ టీచర్లను,మండల సూపర్వైజర్ ను ప్రతిరోజు ఎవరో ఒకరు వచ్చి విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సెంటర్ లో దాదాపు 25మంది పిల్లలు,పదిమంది గర్భిణీలు, 8మంది బాలింతలు ఉన్నారని సర్పంచ్ సంపత్ రెడ్డి వారికి వివరించారు.కరీంనగర్ జిల్లాలో 25సెంటర్లలో అంగన్వాడీ టీచర్లు,ఆయా పోస్టులు పలు కారణాలతో ఖాళీగా ఉన్నాయని,63సెంటర్లలో టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, 230ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు.త్వరలోనే టీచర్ పోస్టులను భర్తీ చేసి, అనంతరం ఆయా పోస్టులను భర్తీ చేస్తామని వివరించారు. అనంతరం అంగన్వాడి సెంటర్ ను సందర్శించి పౌష్టికాహారం,పాలు, కోడిగుడ్లు, పప్పులు,రైస్ నాణ్యతను పరిశీలించారు.సెంటర్ వద్ద రక్షిత మంచినీరు,టాయిలెట్లు వంటి మౌలిక వసతులపై సమీక్షించి లోపాలను సరిదిద్దాలని సూచించారు.గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు అంగన్వాడీ టీచర్లు అంతా సమన్వయంతో పని చేస్తూ పిల్లలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి, సిడిపిఓ శ్రీలత, మండల సూపర్వైజర్ ఇస్రాత్ సుల్తానా,ఉపసర్పంచ్ నక్క ఓదెలు,గ్రామపంచాయతీ కార్యదర్శి పద్మావతి,జిపిఓ అంజయ్య,వార్డు సభ్యుడు మంద లక్ష్మణ్, గ్రామస్తులు పింగిలి సంపత్ రెడ్డి, సంజీవ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



# బీటీపీఎస్ బూడిదతో ప్రజలకు ఇబ్బందులు

- **కాలుష్యంతో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్న చందా లింగయ్యదొర**
- **చర్యలు తీసుకోకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిక**

**భద్రాద్రి కొత్తగూడెం, మే 16(ప్రజా క్షేత్రం):**

పినపాక-మణుగూరు మండలాల మధ్య ఉన్న బీటీపీఎస్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న బూడిదతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొర ఆగ్రహం వ్యక్తం చేశారు. పినపాక మండలం సీతారాంపురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలం చెల్లిన పాత విధానాలతో ప్లాంట్‌ను నిర్వహించడం వల్ల వాతావరణ కాలుష్యం రోజురోజుకు పెరుగుతోందన్నారు. ప్లాంట్ నుంచి వచ్చే బూడిద గ్రామాలపై కురుస్తుండటంతో ప్రజలు శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ఉదయం సమయంలో గ్రామాలు బూడిదతో కప్పుకుపోతుండటంతో ప్రజలు బయటకు రావడానికే ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చెరువులు, కాలువలు బూడిదతో నిండిపోవడంతో వ్యవసాయానికి నీరు పనికిరాక రైతులు నష్టపోతున్నారని అన్నారు. పంటలు దెబ్బతింటున్నా బీటీపీఎస్ అధికారులు సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీఎస్ఆర్ నిధులను గ్రామాల అభివృద్ధికి వినియోగించడం లేదని, రోడ్ల వెంట మొక్కలు నాటడం వంటి కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. బీటీపీఎస్ కారణంగా ప్రాంతంలో ఉష్ణోగ్రతలు పెరిగి, తేమ శాతం తగ్గుతోందన్నారు. ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కాలుష్య నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్లాంట్‌ను మూసివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రిటైర్డ్ సైనికులు భాస్కర్‌రెడ్డి, మనిధర్, కుందూరు, మురళి, అభ్యుదయ సంఘం మండల అధ్యక్షుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా మొగిలి త్యాగరాజులు

- **పార్టీ నాయకులను కలిసిన మొగిలి త్యాగరాజులు**
- **పదవి కల్పించిన వారికి కృతజ్ఞతలు**

**బంగారుపాళ్యం, మే 16(ప్రజా క్షేత్రం):**

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మొగిలి పంచాయతీకి చెందిన మొగిలి త్యాగరాజులు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం పలమనేరు పట్టణంలోని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి పదవి కల్పించినందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, రాష్ట్ర పాలయకరి సంఘం అధ్యక్షుడు ఎం.బి. కుమార్‌రాజా, మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డిలకు త్యాగరాజులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సుబ్బయ్య, మండల యువజన అధ్యక్షుడు గజేంద్రతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 16(ప్రజాక్షేత్రం) :**
కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని క్రమంగా నిర్వీర్యం చేస్తూ గ్రామీణ ప్రజలను ఉపాధి లేని బికారులుగా మారుస్తోందని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి. మల్లేష్ మండిపడ్డారు. శనివారం బోధన్ మండలం ఎరాజ్‌పల్లి గ్రామంలోని చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను ప్రజా పంథా పార్టీ, ఏఐపీకేఎంఎస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్న అనంతరం మల్లేష్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పనులకు అయ్యే ఖర్చుల్లో గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇచ్చేదని, కానీ ప్రస్తుతం ఆ వాటాను 60 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. అదే సమయంలో గతంలో 10 శాతంగా ఉన్న రాష్ట్రాల వాటాను 40 శాతానికి పెంచడం వల్ల, రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం పడి నిధుల కొరత ఏర్పడుతోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం తెస్తున్న కొత్త చట్టాల వల్ల క్షేత్రస్థాయిలో పనులు మందగించి కూలీలు ఉపాధి కోల్పోయే ప్రమాదం పొంచి ఉందన్నారు.
పని ప్రదేశాల్లో మండుతున్న ఎండల నుండి కూలీలకు రక్షణ కల్పించేందుకు కనీసం టెంట్లు, తాగునీరు, గాయాలైతే ప్రథమ చికిత్స చేయడానికి ఫస్ట్ ఎయిడ్ బాక్స్ వంటి ఎలాంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తోడు గత ఐదు వారాలుగా ఉపాధి కూలీలకు పనిచేసిన దినాలకు సంబంధించిన వేతనాల డబ్బులు చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి కూలీల బకాయిలను వారం వారం బట్వాడా చేయాలని, పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులతో పాటు అవసరమైన పనిముట్లను సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌తో పాటు టీయూసీఐ నాయకులు లక్ష్మణ్, పలువురు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న బస్తాలు దహనం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 16(ప్రజాక్షేత్రం) :**
సాలూర మండలం జాడిజమల్పూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకున్న ప్రమాదంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ రైతు కష్టమంతా అగ్నిపాలైంది. బాధిత రైతు ఆలూరి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రేయింబవళ్లు కష్టపడి సాగు చేసిన మొక్కజొన్న పంటను ఇటీవల కోత కోసి, విక్రయించడానికి సిద్ధంగా ఉంచారు. శనివారం ప్రమాదవశాత్తు ఒక్కసారిగా అక్కడ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి నిప్పురవ్వలు ఎగసిపడటంతో నిమిషాల వ్యవధిలోనే మొక్కజొన్న బస్తాలన్నీ మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిబూడిదయ్యాయి. చేతికందివచ్చిన పంట అమ్ముదామనుకునే లోపే కంటిముందే సర్వనాశనం కావడంతో తాను కోలుకోలేని విధంగా నష్టపోయానని బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టానని, ఇప్పుడు చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబం రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని, తగిన నష్టపరిహారం అందించి తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.



## విద్యుదాఘాతంతో ఏడు మేకల మృతి

**జనగామ జిల్లా మే 16(ప్రజాక్షేత్రం):**
దేవరుప్పుల మండలం చిన్న మాడూర్ లో భాషిపాక ఎల్లయ్య ఇంటి పెరటి వైపు ఉన్న మేకల శాలపై విద్యుత్ వైర్లు తెగి పడిపోవడంతో ఏడు మేకలు, మృతిచెందాయి. ఈ ఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. తెగిపడిన విద్యుత్ వైర్లు మేకల షెడ్‌కు సంబంధించిన ఇనుప ఫెన్సింగ్‌కు తాకడంతో భాషిపాక ఎల్లయ్య తండ్రి బిక్షపతి కి చెందిన ఏడు మేకలు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో రోజువారీ జీవనం కోసం ఈ మేకలనే నమ్ముకున్న భాషిపాక ఎల్లయ్య కు ఈ ప్రమాదం వల్ల తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లింది. కుటుంబానికి ఆధారం లేకుండా పోవడంతో బాధితుడు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ దుర్ఘటనపై స్పందించిన సర్పంచ్, మైదం జోగేశ్వర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కరెంట్ షాక్ తో ఏడు మేకలు మృతి చెందిన ఘటన భాషిపాక ఎల్లయ్య కుటుంబానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. జీవనాధారాన్ని కోల్పోయి రోడ్డున పడిన ఆ బాధితుడిని ప్రభుత్వం మరియు అధికారులు తక్షణమే ఆదుకోవాలని సర్పంచ్ మైదం జోగేశ్వర్ విజ్ఞప్తి చేశారు.









# గృహ సహాయకుల నమోదే భద్రతకు శ్రీరామరక్ష

- **భద్రతే లక్ష్యంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ అవగాహన**

**కాప్రా, మే 16(ప్రజా క్షేత్రం):**
నగర భద్రతను మరింత పటిష్ఠం చేసే దిశగా మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ప్రత్యేక చర్యలు చేపట్టింది. గృహ సహాయకులు, అద్దెదారులు, భద్రతా సిబ్బంది, ఒంటరిగా నివసించే వృద్ధుల వివరాల నమోదు-ధృవీకరణ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కాప్రా సర్కిల్ పరిధిలోని ఈశ్వరిపూరి కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా స్వామివారిని దర్శించుకున్న ఆమె అనంతరం కాలనీ వాసులతో సమావేశమై భద్రతా చర్యల ప్రాముఖ్యతను వివరించారు. నగరాల్లో పెరుగుతున్న నేరాల నేపథ్యంలో ప్రతి ఇంటిలో పనిచేసే గృహ సహాయకులు, వాచ్‌మెన్‌లు, అద్దెదారుల వివరాలు స్థానిక పోలీసుల వద్ద నమోదై ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే నేర నియంత్రణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా హాక్‌ఐ అల్ట్రా యాప్ వినియోగంపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ముందుగా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని "పోలీసులతో నమోదు చేసుకోండి" ట్యాబ్‌లోకి వెళ్లి "కొత్తది జోడించు" ఎంపిక ద్వారా పూర్తి వివరాలు నమోదు చేసి సమర్పించాలని అధికారులు సూచించారు. ఇంటి యజమానులు తమ గృహ సహాయకుల వివరాలను స్వయంగా నమోదు చేసుకోవచ్చని, అద్దెకు నివసించే వారు సమీప పోలీస్ స్టేషన్‌తో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఒంటరిగా నివసించే వృద్ధులు తమ వివరాలను నమోదు చేసుకుంటే అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు వెంటనే స్పందించే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు గమనించిన వెంటనే హాక్‌ఐ యాప్ లేదా డయల్-100 ద్వారా సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డీసీపీ సురేష్ కుమార్, ఏసీపీ వెంకట్ రెడ్డి, సీఐ భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, సాయిల్, విజయ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ వాసులు, మహిళలు, గృహ సహాయకులు పెద్ద సంఖ్యలో హాజరై పోలీసుల సూచనలను ఆసక్తిగా ఆలకించారు.



## మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో ఇద్దరు వృద్ధ మహిళల హత్య

- **అప్పుల వివాదమే కారణమా..?**
- **తాండూరు నుంచి తీసుకెళ్లి హత్య చేసి పూడ్చిపెట్టిన దుండగులు**



**మొయినాబాద్, మే 16(ప్రజా-క్షేత్రం):**
రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామ సమీపంలో ఉన్న ఓ ఫామ్‌హౌస్ దగ్గర ఇద్దరు వృద్ధ మహిళలను దారుణంగా హత్య చేసి పూడ్చిపెట్టిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన స్థానికంగా భయాందోళనలు సృష్టించింది. పోలీసుల సమాచారం ప్రకారం, మృతులు వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన ఇద్దరు మహిళలుగా గుర్తించారు. ఇటీవల తాండూరులో మిస్సింగ్ అయిన ఈ ఇద్దరు మహిళలను కొందరు వ్యక్తులు తీసుకెళ్లినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనంతరం హైదరాబాద్ శివారు ప్రాంతమైన మొయినాబాద్ మండలం తోల్కట్ట గ్రామ సమీపంలోని ఓ ఫామ్‌హౌస్ వద్ద నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి హత్య చేసి, ఆనవాళ్లు కనిపించకుండా అక్కడే పూడ్చిపెట్టినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న తాండూరు పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. హత్యకు గురైన మహిళల నుంచి అప్పులు తీసుకున్న వ్యక్తులే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అప్పుల వ్యవహారంలో తలెత్తిన వివాదాలే ఈ హత్యలకు కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం తరలించిన పోలీసులు, ఘటనకు సంబంధించి పలు కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు

## ఘనంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య జన్మదినం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య జన్మదిన వేడుకలను శనివారం చేవెళ్ల కేజీఆర్ పంక్షన్ హాల్ ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే యాదయ్య జన్మదిన సందర్భంగా శంకర్ పల్లి డబుల్ బెడ్ రూం సంబంధించిన మల్లేష్ యాదవ్ ఎమ్మెల్యే సూచన మేరకు బుక్స్ ఇవ్వడం జరిగింది. అలాగే కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు.

**- శంకర్ పల్లి ప్రజాక్షేత్రం**





## వృద్ధ దంపతులే టార్గెట్.. నేపాలీ ముఠా అరెస్ట్

- **నలుగురు అరెస్ట్.. భారీగా బంగారం, వెండి స్వాధీనం**

**కాప్రా, మే 16 (ప్రజా క్షేత్రం):**
నగరంలో సంచలనం రేపిన జవహర్‌నగర్ భారీ దోపిడీ కేసును మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పోలీసులు ఛేదించారు. నేపాల్‌కు చెందిన దొంగల ముఠాను గుర్తించి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు 60 తులాల బంగారం, 15 కిలోల వెండి వస్తువులు, విదేశీ కరెన్సీతో పాటు ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. మోహన్స్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న అంతర్జాతీయ ఆర్బిట్రేటర్ మురళీమోహన్ నర్సిపురం ఇంటిపై నిందితులు ముందుగానే కన్నేశారు. ఇంట్లో వృద్ధ దంపతులు మాత్రమే ఉంటున్నారనే సమాచారంతో సబీనా అలియాస్ సునీతను పనిమనిషిగా చేర్పించారు. ఆమె ద్వారా ఇంటి పరిస్థితులపై పూర్తి సమాచారం సేకరించి దోపిడీకి పథకం రచించారు. మే 11న సర్వెంట్ క్వార్టర్స్‌లో నకిలీ పుట్టిన రోజు వేడుక ఏర్పాటు చేసి, రాత్రివేళ ఇంట్లోకి చొరబడ్డారు. వృద్ధ దంపతులకు మత్తు పదార్థం ఇచ్చి స్పృహ తప్పేలా చేసి చేతులు, కాళ్లు కట్టేశారు. అనంతరం అల్మారాలు పగులగొట్టి బంగారం, వెండి, 3000 అమెరికన్ డాలర్లు, రెండు మొబైల్ ఫోన్లు దోచుకెళ్లారు. దోపిడీ అనంతరం ఆటో, స్కూటర్లలో పరారైన నిందితులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుని దేశం విడిచి పారిపోవాలని యత్నించినట్లు విచారణలో తేలింది. సీసీ కెమెరా దృశ్యాలు, సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు నిందితుల కదలికలను గుర్తించారు. బెంగళూరు, లక్నో, నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి. శుక్రవారం సికింద్రాబాద్ రేతిఫైల్ బస్ స్టేషన్ వద్ద సునీత అలియాస్ సబీనా, బిస్వాల్, కమల్ బహదూర్, జంకర్ బహదూర్ అలియాస్ శంకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని కమిషనర్ అభినందించారు. ప్రత్యేక బహుమతులు ప్రకటిం





## రాష్ట్రపతి నిలయంలో కూచిపూడి కళావేళ

**బొల్లారం, మే 16(ప్రజా క్షేత్రం):**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని బొల్లారం గ్రామంలోనీ రాష్ట్రపతి నిలయంలో శనివారం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల సందర్భంగా 'నక్షత్ర నాట్య నిలయం' ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు అంకం శిరీష నేతృత్వంలో కళాకారులు ప్రదర్శనలు ఇచ్చారు. పురాణ ఇతిహాస ఘట్టాలను హావభావాలతో ఆవిష్కరించిన కళాకారులు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. తాళలయ సమన్వయంతో సాగిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్రపతి నిలయం ప్రాంగణం భక్తిమయ వాతావరణంతో కళకళలాడింది. ప్రదర్శన అనంతరం కళాకారులను నిర్వాహకులు, భక్తులు అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్మీ జవాన్లు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ యువకులు

- **నలుగురిని రిహాబిలిటేషన్ కేంద్రానికి తరలించిన పోలీసులు**
- **మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందన్న సీఐ నాగరాజు**

**భద్రాద్రి కొత్తగూడెం, మే 16 (ప్రజా క్షేత్రం):**

జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాలతో భద్రాచలం పట్టణంలో గంజాయి అక్రమ రవాణా, సరఫరా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు భద్రాచలం సీఐ నాగరాజు తెలిపారు.
శనివారం పట్టణంలో గంజాయి టెస్టింగ్ కిట్లతో చేపట్టిన తనిఖీల్లో నలుగురు యువకులకు పాజిటివ్‌గా తేలిందన్నారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి భద్రాచలం పట్టణంలోని దక్షత సొసైటీ జిల్లా మత్తుపదార్థాల వ్యసన పునరావాస కేంద్రానికి తరలించినట్లు వెల్లడించారు.భవిష్యత్తులో కూడా మత్తుపదార్థాలు సేవించే వారిపై విస్తృతంగా తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు. ఎవరైనా గంజాయి రవాణా చేస్తున్నట్లు లేదా సేవిస్తున్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. మత్తుపదార్థాలకు బానిసలై యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, తల్లిదండ్రులు పిల్లల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు.

## శని అమావాస్య సందర్భంగా సప్తపురి శనిఘాట్‌లో ప్రత్యేక పూజలు

- **ఆలయాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకుడు పులిమామిడి రాజు**
- **భక్తులతో కలిసి పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు**

**సదాశివపేట, మే 16(ప్రజాక్షేత్రం):**

శని అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు పులిమామిడి రాజు శనివారం ఏడాకులపల్లి గ్రామంలోని శ్రీ సప్తపురి శనిఘాట్ దేవస్థానాన్ని భక్తిశ్రద్ధలతో సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థాన అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. శని అమావాస్య కావడంతో భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పులిమామిడి రాజు భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శని అంటే బాధ కాదని, శక్తి కేంద్రంగా భావించి ఆధ్యాత్మిక అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గోల్డ్‌స్మిత్ కె. నర్సింలు, బగిలి విష్ణు తదితర భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాల పంపిణీ నిర్వహించారు.



## రేకుర్తి అభివృద్ధికి మరో అడుగు

- **పలు అభివృద్ధి పనులకు భూమిపూజ**
- **ప్రజలకు మెరుగైన వసతులే లక్ష్యమన్న మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్, మే 16 (ప్రజాక్షేత్రం):**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 19వ డివిజన్ రేకుర్తి ప్రాంతంలో పలు అభివృద్ధి పనులకు శనివారం భూమిపూజ నిర్వహించారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్ సుధాగోని మాధవి-కృష్ణగౌడ్ పాల్గొని పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రేకుర్తి ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధికి నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు తదితర సౌకర్యాలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులతో ప్రాంత రూపురేఖలు మారనున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎంఆర్ఎఫ్ కార్మిక పోరాట సమితి 11వ వార్షికోత్సవం ఘనం

- **ఏడుపాయల వనదుర్గ భవాని ఆలయంలో వేడుకలు**
- **కార్మిక హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామన్న నాయకులు**

**సదాశివపేట, మే 16 (ప్రజాక్షేత్రం):**

ఎంఆర్ఎఫ్ కార్మిక పోరాట సమితి (కేపీఎస్) 11వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గ భవాని మాత దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. కేపీఎస్ అధ్యక్షుడు కొత్తగొల్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఆర్ఎఫ్ మెదక్ ప్లాంట్‌కు చెందిన కార్మికులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ప్రస్తుత, మాజీ కౌన్సిలర్లు, పట్టణ రాజకీయ నాయకులు, జిల్లా జేఏసీ నాయకుడు సత్తయ్య యాదవ్, యూనియన్ నాయకులు మల్లేశం, నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణ, విఠల్, శ్రీనివాస్, రాజ్‌కిరణ్, వెంకట్రావు, వీరన్న, సత్యనారాయణరెడ్డి, జైపాల్, నర్సింలు, రాచయ్య, స్వామి, ఎం.డి. నజీర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగొల్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ 11వ వార్షికోత్సవానికి హాజరైన ప్రతి కార్మికునికి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల ఐక్యత, సహకారంతో గత 11 ఏళ్లలో రెండుసార్లు యూనియన్‌ను విజయవంతం చేసుకున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగిస్తామని, ప్రతి కార్మికుడి సమస్య పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్మికులు, అతిథులకు నాయకులు ధన్యవాదాలు తెలిపారు.






## బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

- **పోక్సో కేసులో చర్యలు తీసుకోవాలని డిమాండ్**
- **సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ సంఘాల నిరసన**

**భద్రాద్రి కొత్తగూడెం,మే 16(ప్రజా క్షేత్రం):**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై నమోదైన పోక్సో కేసులో ఇప్పటివరకు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళనకరమని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ అనుబంధ ప్రజాసంఘాలు పీడీఎస్‌యూ, పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు ఆరోపించారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కెచ్చల కల్పన, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ మాట్లాడుతూ మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని అన్నారు. సాధారణ ప్రజలపై వెంటనే చర్యలు తీసుకునే పోలీసులు అధికార పార్టీల నాయకుల కుటుంబ సభ్యుల విషయంలో ఆలస్యం చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ ఒత్తిడులకు లోనవుతోందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గం నుంచి బండి సంజయ్‌ను భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదైన వెంటనే నిందితుడిని అరెస్టు చేసి బాధితురాలికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం, పోలీసులు నిర్లక్ష్య ధోరణిని విడనాడి వెంటనే బండి భగీరథను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యవాదులు, మహిళా సంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రామకృష్ణ, మంగన్న, వీరభద్రం, శివప్రశాంత్, యదళ్ళపల్లి సావిత్రి, పద్మ, మహేశ్వరి, కిషోర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## తుంపల్లిలో అక్రమ మట్టి తరలింపు ఆరోపణలు

- **మైనింగ్ అనుమతులు లేకుండానే మట్టి**
- **తరలిస్తున్నారన్న గ్రామస్తులు**
- **ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని ఆవేదన**

**ఆత్మకూర్, మే 16 (ప్రజా క్షేత్రం):**

ఆత్మకూర్ మండలం తుంపల్లి గ్రామంలో సర్పంచ్ భర్త భావని దామోదర్‌రెడ్డి అక్రమంగా మట్టి తరలిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. గ్రామంలోని 81 సర్వే నంబర్‌లో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనుల కోసం మట్టిని చదును చేస్తున్న క్రమంలో పెద్ద ఎత్తున మట్టి తరలింపు జరుగుతోందని తెలిపారు.
మైనింగ్ శాఖ అనుమతులు లేకుండానే సొంత అవసరాల కోసం మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎమ్మార్వో, ఎస్సై, సీఐలకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో అక్రమాలు కొనసాగుతున్నాయని మండిపడ్డారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల కోసం మట్టిని చదును చేస్తున్న కాంట్రాక్టర్ సహకారంతో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఘటనాస్థలాన్ని వెంటనే పరిశీలించి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.






## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కూపన్లు ఇవ్వాలి – గ్రామ ప్రజల వినతి

**బూర్గంపహాడ్ మే 16(ప్రజా క్షేత్రం):**

బూర్గంపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఇసుక కొరత తీవ్ర సమస్యగా మారిందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి సుమారు 51 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ఇసుక ధరలు భారీగా పెరగడంతో పేద లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గతంలో ట్రక్కు ఇసుక ధర రూ.900 నుండి రూ.1200 వరకు ఉండేదని, ప్రస్తుతం రూ.3000 నుండి రూ.4000 వరకు పెరగడంతో పేద కుటుంబాలు ఇళ్ల నిర్మాణం కొనసాగించలేకపోతున్నాయని పేర్కొన్నారు. దీంతో అనేక ఇందిరమ్మ ఇళ్ల పనులు మధ్యలోనే నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా గ్రామంలోని బురదమయమైన దారుల అభివృద్ధి కోసం మంజూరైన సీసీ రోడ్ల పనులు కూడా ఇసుక కొరత కారణంగా నెమ్మదిస్తున్నాయని తెలిపారు. మరోవైపు వర్షాకాలం సమీపిస్తుండటంతో, వరదల కారణంగా నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గతంలో మాదిరిగానే పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఇసుక కూపన్లు అందజేసి, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని గ్రామ ప్రజలు, లబ్ధిదారులు తహసీల్దార్‌ను కోరారు.

## యువకుడిపై దాడి.. ఐఫోన్, నగదు దోపిడి

- **కరీంనగర్‌లో ముగ్గురు అరెస్ట్.. కారు, ఫోన్లు స్వాధీనం**

**కరీంనగర్, మే 16 (ప్రజాక్షేత్రం) :**

కరీంనగర్ రూరల్ పరిధిలో యువకుడిని బెదిరించి ఐఫోన్, నగదు లాక్కున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుడిని బావిలోకి తోసి చంపేస్తామని బెదిరించి దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు.
కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వావిలాలపల్లికి చెందిన పుతుపరంబిల్ రోహన్ (19) ఈ నెల 13న తీగలగుట్టపల్లి శివారులోని బాక్స్ క్రికెట్ మైదానానికి స్నేహితులతో కలిసి వెళ్లాడు. అక్కడ సమీపంలోని కిరాణా దుకాణం వద్ద ఉండగా దుర్గమ్మగడ్డకు చెందిన దావ దర్శన్ (27), గాంధీనగర్‌కు చెందిన కాసారపు రోహిత్ కుమార్ అలియాస్ రిషి (22) అతడిని పక్కకు తీసుకెళ్లారు.
డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రోహన్‌పై దాడి చేశారు. తన వద్ద డబ్బులు లేవని చెప్పినా వినకుండా కొట్టడంతో పాటు చంపేస్తామని బెదిరించినట్లు సమాచారం. అనంతరం గన్నేరువరం మండలానికి చెందిన కొనగాని మధు (25) అక్కడికి చేరుకుని ముగ్గురూ కలిసి బాధితుడిని మరింత భయపెట్టారు. బావిలోకి తోసేస్తామని హెచ్చరించడంతో భయపడిన రోహన్ తన ఐఫోన్‌ను వారికి ఇచ్చేశాడు.
తర్వాత నిందితులు అతడిని కారులో వావిలాలపల్లి రామాలయం వద్ద దింపి ఈ విషయం బయటకు చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించినట్లు పోలీసులు తెలిపారు. మరుసటి రోజు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
పోలీసులు శనివారం బొమ్మకల్ బైపాస్ రోడ్డులోని సమీర్ దాబా వద్ద ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి స్విఫ్ట్ డిజైర్ కారు, బాధితుడి ఐఫోన్‌తో పాటు మరో మూడు మొబైల్ ఫోన్లు, రూ.5 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.
నిందితులపై గతంలోనూ పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. దర్శన్‌పై మూడు కేసులు, రోహిత్ కుమార్‌పై పోక్సో కేసు, మధుపై గంజాయి కేసు ఉన్నట్లు వెల్లడించారు. బెయిల్‌పై బయటకు వచ్చిన తరువాత కూడా నేరాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.
ఇలాంటి దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడేవారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.





# లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డుల అందజేత

- **10 మందికి రూ.55.60 లక్షల చెక్కులు పంపిణీ**
- **ఆపరేషన్ చేయూత'తో జనజీవన స్రవంతిలోకి వచ్చారన్న ఎస్పీ రోహిత్‌రాజు**



**భద్రాద్రి కొత్తగూడెం, మే 16 (ప్రజా క్షేత్రం):**

ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ క్యాడర్ల 10 మంది సభ్యులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున మంజూరైన రివార్డులను జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఐపీఎస్ శనివారం అందజేశారు. మావోయిస్టు పార్టీలో పనిచేసిన సమయంలో వారి క్యాడర్‌ను బట్టి ప్రభుత్వం ప్రకటించిన రివార్డుల మేరకు మొత్తం రూ.55.60 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ప్రత్యేక చొరవ తీసుకొని లొంగిపోయిన వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహక నగదును అందజేసినట్లు ఎస్పీ తెలిపారు. రివార్డులు పొందిన వారిలో ఒకరు స్టేట్ కమిటీ సభ్యుడు, ఒకరు డివిజనల్ కమిటీ సభ్యుడు, ఆరుగురు ఏరియా కమిటీ సభ్యులు, ఇద్దరు దళ సభ్యులు ఉన్నారు. ప్రస్తుతం వారి జీవన పరిస్థితులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రివార్డుల రూపంలో పొందిన నగదును విలాసాలకు కాకుండా జీవనోపాధి కోసం వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా పోలీసులు చేపట్టిన 'ఆపరేషన్ చేయూత' కార్యక్రమానికి ఆకర్షితులై లొంగిపోయిన మావోయిస్టులకు పోలీసు శాఖ అండగా ఉంటుందని తెలిపారు. పునరావాసంతో పాటు ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.



# రామాలయం పరిసరాల్లో బెల్ట్‌షాపులు తొలగించాలి

- **భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయంటూ తహసీల్దార్‌కు వినతి**
- **అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**భద్రాద్రి కొత్తగూడెం, మే 16(ప్రజా క్షేత్రం):**

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం పరిసరాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపులను తొలగించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. రామాలయం చుట్టుపక్కల ఉన్న మద్యం దుకాణాల నిర్వాహకులు అక్రమంగా బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసి మధ్యాహ్నం సమయంలో మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు. మద్యం సేవించిన వ్యక్తులు ఆలయ దర్శనానికి వచ్చే భక్తులు, సందర్శకులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. మద్యం మత్తులో ఉన్న కొందరు దర్శనానికి వెళ్లే వారిని అడ్డుకోవడం, అసౌకర్యానికి గురిచేయడం జరుగుతోందని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు భద్రాద్రి శ్రీ సీతారాములపై ఉన్న భక్తి కారణంగా స్పందించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సూపర్‌మార్కెట్ బజార్, గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకుని, భక్తులకు ఇబ్బందులు లేకుండా వెంటనే తొలగించాలని అధికారులను కోరారు.

# ఎస్సీ సెల్ పదవిపై సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు

**బంగారుపాళ్యం, మే 16 (ప్రజా క్షేత్రం):**

చిత్తూరు జిల్లా వైసీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మొగిలి త్యాగరాజులు శనివారం పలమనేరు పట్టణంలోని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనకు పదవి కల్పించినందుకు సునీల్‌కుమార్‌కు త్యాగరాజులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ సుబ్బయ్య, మండల యువజన అధ్యక్షుడు గజేంద్రతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.








# పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ నివారణ

- **దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించిన వైద్యాధికారులు**
- **ప్రతి మంగళ, శుక్రవారాలు 'డ్రైడే' పాటించాలని సూచన**

**భద్రాద్రి కొత్తగూడెం, మే 16(ప్రజా క్షేత్రం):**

డ్రైనేజీ కాలువలు, మోరీలు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచితేనే డెంగీ వ్యాధి నివారణ సాధ్యమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ అన్నారు. ప్రపంచ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ రామదాస్ ఆధ్వర్యంలో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అవగాహన ర్యాలీ, మానవహారం, సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కువ మరణాలు దోమకాటు వల్ల సంభవించడం బాధాకరమన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ప్రతి మంగళవారం, శుక్రవారం 'డ్రైడే' పాటిస్తూ దోమలు పుట్టకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైనేజీలు, మోరీల్లో చెత్త వేయడం వల్ల మురుగునీరు నిలిచి దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని చెప్పారు. మురుగు కాలువల్లో చెత్త వేయడం ప్రజా ఆరోగ్య రక్షణ చట్టం ప్రకారం నేరమని హెచ్చరించారు. నీటి ట్యాంకులు, డబ్బాలను మూతలతో మూసి ఉంచాలని, రాత్రివేళ దోమతెరలు వినియోగించాలని, గృహాలకు దోమజాలీలు అమర్చుకోవాలని సూచించారు. డెంగీ, మలేరియా, బోదకాలు, మెదడు వాపు వంటి వ్యాధుల నుంచి రక్షణకు దోమల నివారణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. తీవ్ర జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, వాంతులు, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకుని చికిత్స పొందాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేశ్, అసిస్టెంట్ మలేరియా అధికారి కుమారస్వామి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# ఎస్ఐఆర్ ప్రచారానికి ఇంటింటికీ వెళ్లాలి

- **జహీరాబాద్‌లో మజ్లిస్ పార్టీ సమావేశం**
- **పార్టీ బాధ్యులకు దిశానిర్దేశం చేసిన కౌసర్ మొహియుద్దీన్**

**జహీరాబాద్, మే 16(ప్రజా క్షేత్రం):**

ఆల్ ఇండియా మజ్లిస్‌ఎఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని మజ్లిస్ పార్టీ కార్యాలయంలో శనివారం ముఖ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి కార్వాన్ ఎమ్మెల్యే, సంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జ్ కౌసర్ మొహియుద్దీన్, అసదుద్దీన్ ఒవైసీ వ్యక్తిగత కార్యదర్శి సయ్యద్ ముస్తాక్ అహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జహీరాబాద్ మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ అథర్ అహ్మద్ నాయకులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జూన్ నెల నుంచి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంపై పార్టీ నాయకులకు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ పరిధిలో చురుగ్గా పనిచేస్తూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఖాజా నిజాముద్దీన్, జిల్లా కార్యదర్శి మొహియుద్దీన్ ఘోరీ, సదాశివపేట అధ్యక్షుడు షేక్ గౌస్‌పాషా, బీదర్ సిటీ అధ్యక్షుడు సఫీయుల్లా బేగ్, కోహీర్ అధ్యక్షుడు మహ్మద్ రఫీ, దిగ్వాల్ అధ్యక్షుడు మహ్మద్ వాజిద్, జహీరాబాద్ టౌన్ జాయింట్ సెక్రటరీ షేక్ ఇలియాస్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వీఐపీ కాన్వాయ్‌లకు కత్తెర వేయాలి

- **ఇంధన పొదుపుతో దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలని పిలుపు**
- **ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచాలని సూచన**

**వనపర్తి, మే 16(ప్రజా క్షేత్రం):**

ప్రపంచ వ్యాప్తంగా చోటుచేసుకుంటున్న పరిణామాలు, ముఖ్యంగా ఇరాన్-అమెరికా ఉద్రిక్తతల ప్రభావంతో భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతోందని వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, 13వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బి. పరశురాం పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో దేశంలో చమురు నిల్వలను సంరక్షించాల్సిన అవసరం ఉన్నందున ప్రజలతో పాటు వీఐపీలు కూడా ఇంధన పొదుపు పాటించాలని సూచించారు. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, రాష్ట్ర ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో వాహనాల సంఖ్యను 90 శాతం వరకు తగ్గించాలని కోరారు. ఇలా చేయడం ద్వారా డీజిల్, పెట్రోల్ వినియోగం తగ్గి చమురు నిల్వలు పెరుగుతాయని తెలిపారు. డీజిల్, పెట్రోల్ వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇంధన పొదుపు, విదేశీ మారక ద్రవ్య సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రధాని మోదీ సూచనలను ప్రతి భారతీయుడు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నందిపేట్ తిరుపతయ్య యాదవ్, నడిమింటి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.





# ఓటరు సవరణ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

- **జూన్ 24 నుంచి జులై 25 వరకు ఇంటింటి సర్వే**
- **ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమీక్షలు నిర్వహించాలని సూచన**

**భద్రాద్రి కొత్తగూడెం, మే 16 (ప్రజా క్షేత్రం):**

జిల్లాలో జూన్ 24 నుంచి జులై 25 వరకు నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, సంబంధిత అధికారులతో ఎస్ఐఆర్ మ్యాపింగ్ పురోగతి, ఇంటింటి సర్వే ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాల ద్వారా ఓటర్ల వివరాలు సేకరిస్తారని తెలిపారు. జూన్ 15 నుంచి 22 వరకు సర్వేకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, జూన్ 24 నుంచి బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాలు పంపిణీ చేసి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ప్రజలకు తమ పరిధిలోని బీఎల్ఓల పేర్లు, మొబైల్ నంబర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు తెలిసేలా విస్తృత ప్రచారం చేపట్టాలని చెప్పారు. వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, ఓటరు జాబితాలో పేర్లు లేకపోవడం వంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారం6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బదిలీ అయిన ఓటర్ల వివరాలను సక్రమంగా నమోదు చేసి రికార్డులు నవీకరించాలని తెలిపారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి మినిట్స్ భద్రపరచాలని ఆదేశించారు. బీఎల్ఓలకు ప్రత్యేక శిక్షణ, ఐటీ బృందాలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఒకే కుటుంబ సభ్యుల పేర్లు ఒకే పోలింగ్ కేంద్ర పరిధిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని తెలిపారు. ఇప్పటివరకు 17 వేల మ్యాపింగ్‌లు పూర్తి చేశామని వెల్లడించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తున్నామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.




# పైప్‌లైన్ దెబ్బతిని నీటి వృథా

- **వారంరోజులుగా తాగునీరు వృథాగా పారుతున్నదంటున్న స్థానికులు**
- **కరెంట్ ప్రమాదం ఉంటుందంటూ ఆందోళన**

**పెద్దకొడప్‌గల్, మే 16(ప్రజా క్షేత్రం):**



మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గంగారాం ఇంటి వెనుక ఉన్న ఎస్సీ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ పనులు చేపట్టే సమయంలో వాటర్ పైప్‌లైన్ దెబ్బతింది. దీంతో గత వారం రోజులుగా తాగునీరు వృథాగా పారిపోతుండటంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో ఎర్తింగ్ ఏర్పాటు చేయడం వల్ల నీటికి కరెంట్ వచ్చే ప్రమాదం ఉందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపిల్లలు, మహిళలు భయాందోళనల మధ్య జీవనం సాగిస్తున్నారని తెలిపారు. దెబ్బతిన్న పైప్‌లైన్‌ను వెంటనే మరమ్మతు చేసి సమస్యను పరిష్కరించాలని సబ్‌స్టేషన్ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బందిని స్థానికులు కోరుతున్నారు.



## టాప్ విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా సత్కారం

- **టాప్ విద్యార్థులకు నగదు బహుమతులు**
- **ఉల్లాస్ వాలంటీర్లకూ సత్కారం**

**విద్యార్థులకు కలెక్టర్ మను చౌదరి ప్రోత్సాహం**

**మేడ్చల్ మల్కాజిగిరి, మే 16 (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన 'విద్యా విజయోత్సవం' కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. పదో తరగతి, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో టాప్10లో నిలిచిన విద్యార్థులతో పాటు క్రీడా విభాగంలో ప్రతిభ కనబర్చిన టాప్ 3 విద్యార్థులు, ఉత్తమ సేవలు అందించిన ముగ్గురు ఉల్లాస్ వాలంటీర్లను జిల్లా కలెక్టర్ మను చౌదరి సత్కరించారు. మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.10 వేల నగదు బహుమతి, మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని పేర్కొంటూ తన పాఠశాల రోజుల అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉన్నత విద్య కోసం అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. జిల్లా విద్యాశాఖ అధికారి ఐ. విజయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటడం గర్వకారణమన్నారు. జిల్లా ఫలితాల్లో కీలక పాత్ర పోషించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ ఫొటోలు దిగారు.

## రాజకీయ లబ్ధి కోసమే పాదయాత్ర

- **పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి**

**రాజేంద్రనగర్, మే 15(ప్రజాక్షేత్రం):**

రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, మాజీ శాసనమండలి ఛైర్మన్ స్వామి గౌడ్ వాక్ ఫర్ వాటర్ పాదయాత్రను రాజకీయ లబ్ధి కోసమే నిర్వహిస్తున్నారని బండ్లగూడ జాగీర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.... టిఆర్ఎస్ పార్టీ నిర్వహించిన వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని శుక్రవారం కిస్మత్పూర్ వివేకానంద విగ్రహం నుండి బండ్లగూడ చౌరస్తా వరకు పాదయాత్రను నిర్వహించారు. ఈ యొక్క పాదయాత్ర తో నియోజకవర్గం పై ఎటువంటి అవగాహన లేని నాయకులతో రాజకీయ లబ్ధి కోసమే నాలుగేళ్లకు ఒకసారి ప్రజల్లోకి వచ్చి ఒకటి రెండు కిలోమీటర్లు పాదయాత్ర చేస్తే సరిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు నీటి సరఫరా విషయంలో ప్రభుత్వం అధికారులు సిబ్బంది సహకారంతో చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. అవగాహన లేని నాయకుల మధ్య నాలుగు సార్లు గెలిచారు, నాలుగు రోజులు సరిగ్గా ప్రజలకు నీరు అందించలేదని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను విమర్శించడం మానుకోవాలని ఆయన బిఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. ఎమ్మెల్యే సహకారంతో నియోజకవర్గం పరిధిలో ప్రజలకు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎప్పటికప్పుడు సూచిస్తున్నారని ఆయన తెలిపారు. ప్రజల కోసం పదేళ్ల క్రిందటి నీటి సమస్యలను తీర్చిన ఘనత ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు దక్కిందని ఆయన తెలిపారు. రాజకీయం కోసం ప్రజలను తప్పుదోవ పట్టించేలా వివరించొద్దని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రజల మనిషి ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి బిఆర్ఎస్ పార్టీ నాయకులకు లేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసి ఎస్ చైర్మన్ రామ్ దాస్ ముదిరాజ్, మాజీ మేయర్ మహేందర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ సాగర్ గౌడ్, గోకరి సురేష్ గౌడ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర మంత్రి నివాసంలో పోలీసుల తనిఖీలు

- **భగీరథ కోసం గాలిస్తున్న పోలీసులు**

**కరీంనగర్, మే 16 (ప్రజా-క్షేత్రం) :**



పోక్సో కేసులో నిందితుడైన బండి భగీరథ కోసం పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో కేంద్ర మంత్రి నివాసంలో శనివారం సోదాలు నిర్వహించారు. సీపీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. భగీరథ ఆచూకీ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐదు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని వెల్లడించారు. ఇదిలా ఉండగా, భగీరథ దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. కేసు విచారణను న్యాయమూర్తి వారం రోజుల పాటు వాయిదా వేసిన విషయం తెలిసిందే.

# సామాన్యుల ప్రాణాలకు విలువేది..?
# చంపేసినా..పోస్టుమార్టం నివేదికలివ్వరా..?

- **అనుమానాస్పద మృతుల కేసుల్లో డీఎంహెచ్‌వో విచారణేది..?**
- **వైద్యం పేరిట ప్రైవేటు ఆస్పత్రుల ఫక్తు వ్యాపారం**
- **కరీంనగర్‌లో బయట పడుతున్న కార్పొరేట్ ఆసుపత్రుల బాగోతం**
- **రోగి చనిపోయినా గుట్టుగా చికిత్స.. 'వన్' హాస్పిటల్‌పై 'ఠాగూర్' తరహా ఆరోపణలు**
- **అదే ఆసుపత్రిలో మంత్రి అడ్లూరికి 'లిఫ్ట్' ప్రమాదం..**
- **మరునాడే తనిఖీల పేరుతో ఆరోగ్యశాఖ అధికారుల హడావుడి**
- **యశోద కృష్ణ ఆసుపత్రిలోనూ మహిళ మృతి చెందితే కనీసం కన్నెత్తి చూడని డీఎంహెచ్‌వో**

**కరీంనగర్, మే 16(ప్రజాక్షేత్రం):**

ప్రాణం పోయాల్సిన వైద్య రంగం.. కరీంనగర్ జిల్లాలో కాసులు కురిపించే వ్యాపారంగా మారిపోయింది. ప్రైవేట్ ఆసుపత్రుల వైద్య నిర్లక్ష్యం, అడ్డగోలు బిల్లులు, భద్రతా లోపాలు ఇప్పటికే ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని నింపగా.. తాజాగా నగరంలో చోటుచేసుకున్న వరుస ఘటనలు ప్రైవేట్ వైద్యు ల అసలు రూపాన్ని బట్టబయలు చేశాయి. సామాన్య రోగుల మరణాలను దాచి పెట్టి డబ్బులు గుంజే అరాచకాలు ఒకవైపు.. కనీస భద్రత లేక సాక్షాత్తు రాష్ట్ర మంత్రి ఆసుపత్రి లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన ప్రమాదాలు మరోవైపు జిల్లాలో కలకలం రేపుతున్నాయి. గత నెలలో కరీంనగర్‌లోని 'వన్ హాస్పిటల్' లో చోటుచేసుకున్న ఘోరం 'ఠాగూర్' సినిమా దృశ్యాలను తలపించింది. వేములవాడ మండలం శాత్రాజుపల్లికి చెందిన సాహెబ్ బీ (60) అనే మహిళ గుండె సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో చేరారు. ఆమె మృతి చెందినప్పటికీ.. కుటుంబ సభ్యులకు ఆ నిజం చెప్పకుండా ఐసీయూలో ఉంచి చికిత్స పేరిట అడ్డగోలుగా బిల్లులు వసూలు చేశారని ఎంఐఎం నాయకులు, బాధితులు ఆరోపించారు. ఈ వ్యవహారం బయటకు పొక్కడంతో ఆసుపత్రి ఎదుట రోగుల బంధువులు పెద్ద ఎత్తున నిరసనలకు దిగారు. సదరు ఆసుపత్రిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, సీజ్ చేయాలని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

**అదే ఆసుపత్రిలో మంత్రికి 'లిఫ్ట్' గండం!**

రోగి మృతి వ్యవహారంలో వివాదాల్లో ఉన్న అదే 'వన్ హాస్పిటల్' లో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రమాదానికి గురికావడం ఆసుపత్రుల భద్రతా లోపాలకు అద్దం పడుతోంది. ఆసుపత్రిలో ఉన్న ఒక రోగిని పరామర్శించేందుకు మంత్రి వెళ్లారు. మంత్రి ఎక్కిన లిఫ్ట్.. సాంకేతిక లోపంతో ఒక్కసారిగా కిందకు జారిపోయింది. మంత్రి కొద్దిసేపు అందులోనే చిక్కుకుపోగా, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస పర్యవేక్షణ, ఫైర్ సేఫ్టీ, లిఫ్ట్ ఫిట్‌నెస్ లేని ఇలాంటి ఆసుపత్రుల్లో సామాన్యుల ప్రాణాలకు గ్యారెంటీ ఎక్కడుందని ఆయన ప్రశ్నించారు.






**సామాన్యుడి ప్రాణం చౌకనా?**
**వీఐపీలకేనా రక్షణ?**

మంత్రికి ప్రమాదం జరగ్గానే కదిలిన అధికార యంత్రాంగం మరునాడే ఆస్పత్రుల్లో సేఫ్టీపై నానా హడావుడి చేసింది. అంతకుముందు సామాన్య మహిళ వైద్య నిర్లక్ష్యంతో చనిపోతే ఎందుకు స్పందించలేదన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. వైద్యుల నిర్లక్ష్యంతో, శస్త్ర చికిత్సలు వికటించి రోగులు మృతి చెందుతున్నట్లుగా ఆరోపణలు వచ్చిన కేసుల్లో పోస్టు మార్టం నిర్వహించకుండా ఉండటం గమనార్హం. డీఎంహెచ్ స్థాయి అధికారి స్థాయి ఆస్పత్రిని విజిట్ చేయడంతో పాటు రిపోర్ట్ చేయాల్సి ఉండగా.. ఇవేవీ జరగడం లేదు. సామాన్యుల ప్రాణాలకు విలువ లేదన్నట్లుగా ఆరోగ్యశాఖ వ్యవహరిస్తుండటం గమనార్హం.

ఇటీవల నగరంలోని 'యశోద కృష్ణ ఆసుపత్రి'లోనూ ఆపరేషన్ వికటించి ఒక మహిళ మృతి చెందింది. బాధితులు న్యాయం కోసం కాళ్లరిగేలా తిరిగారు. రోగి ప్రాణాలకు వెల కట్టి ఎంతోకొంత ముట్టజెప్పి ఆస్పత్రి యాజమాన్యం.. అన్యాయం చేసి చేతులు కడిగేసుకుంది.

**కరీంనగర్‌లో కమీషన్ రాకెట్**

గ్రామీణ ప్రాంతాల్లోని అమాయక ప్రజలను టార్గెట్ చేస్తూ ప్రైవేట్ ఆసుపత్రులు ఒక పెద్ద 'కమిషన్ రాకెట్' నడుపుతున్నాయి. గ్రామాల్లోని కొందరు ఆర్ఎంపీలతో కుమ్మక్కై, చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకే రోగులను భయపెట్టి నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయిస్తున్నారు. ఇలా పంపినందుకు సదరు ఆర్ఎంపీలకు భారీగా కమిషన్లు ముడుతున్నట్లు స్వయంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రస్తావించడం గమనార్హం. కరీంనగర్ జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులపై, అర్హత లేని సిబ్బంది నిర్వహణపై తక్షణమే ఉన్నతాధికారుల బృందంతో సమగ్ర విచారణ జరిపించాలని, నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రుల లైసెన్సులు రద్దు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## డెంగ్యూపై అప్రమత్తత అవసరం

- **ప్రతి కుటుంబం బాధ్యతగా ముందుకు రావాలి**
- **నాగోల్‌లో అవగాహన ర్యాలీ**
- **అక్రమ క్లినిక్‌లపై వైద్యశాఖ చర్యలు**

**నాగోల్, మే 16(ప్రజా క్షేత్రం):**



డెంగ్యూ నివారణలో ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమా గౌరీ సూచించారు. జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ కార్యక్రమం ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నాగోల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ నాగరాజు, ఉప డెమో వసంతరెడ్డి పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, జీహెచ్ఎంసీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్న ర్యాలీలో డెంగ్యూ నివారణపై నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ ఉమా గౌరీ మాట్లాడుతూ నిల్వ నీటిలో పెరిగే దోమల వల్లే డెంగ్యూ వ్యాప్తి చెందుతుందని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి డబ్బాలు, కుండీలు, కూలర్లు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని, స్వయంగా మందులు వాడొద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ప్రజలతో డెంగ్యూ నివారణ ప్రతిజ్ఞ చేయించి కరపత్రాలు పంపిణీ చేశారు.

**అక్రమ క్లినిక్‌ల సీజ్**

కార్యక్రమం అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ ఉమా గౌరీ ఆధ్వర్యంలో నాగోల్ బండ్లగూడ ప్రాంతంలోని ప్రైవేట్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్న ఓలీవ్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్, సురక్ష పాలీ క్లినిక్, లిటిల్ స్టార్ క్లినిక్, కేర్ డెంటల్ క్లినిక్, కౌసల్య పాలీక్లినిక్, అక్క డెంటల్ క్లినిక్‌లను సీజ్ చేశారు. తనిఖీల్లో అధికారులు వసంత రెడ్డి, డాక్టర్ పవన్, డాక్టర్ గీత పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కారం కావాలంటే మళ్లీ కేసీఆర్ రావాలి

- **బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి**

**రాజేంద్రనగర్, మే 15(ప్రజాక్షేత్రం):**

ప్రజల సమస్యలు తీరాలంటే మళ్ళీ కేసిఆర్ ప్రభుత్వమే రావాలని రాజేంద్రనగర్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. శనివారం నార్సింగి సర్కిల్ చౌరస్తా నుండి వాటర్ వర్క్స్ కార్యాలయం వరకు మహిళలతో కలిసి వాక్ ఫర్ వాటర్ పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు కార్తీక్ రెడ్డిని కలిసి తాము ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులను వివరిస్తూ వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ... మంచినీటి సరఫరా పై స్థానిక ఎమ్మెల్యేకు కనీస అవగాహన లేకపోవడం వల్లే ప్రజలకు ఈ కష్టాలు వచ్చాయన్నారు. నియోజకవర్గంలో సరిపడా నీటిని అందిస్తున్నామని అధికారులు చెప్పడం వివేక శూన్యం అని మండిపడ్డారు. పాదయాత్ర పొడవునా కనిపిస్తున్న వాటర్ ట్యాంకర్లే ఇక్కడి నీటి ఎద్దడికి ప్రత్యక్ష నిదర్శనం అని అన్నారు. మేము మంచినీటి సమస్యల పై పోరాటం ప్రారంభిస్తున్నామని తెలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆగమేఘాలపై అధికారులతో చర్చలు జరిపారు. ప్రజల సమస్యలు ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు నీటి సమస్య పరిష్కారం కావాలంటే రోజు విడిచి రోజు నీటి సరఫరాను శుద్ధిచేసి అందించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో మంచినీటి నల్ల బిల్లులను వెంటనే మాఫీ చేయాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన మరచి రియల్ ఎస్టేట్ దందా నడిపిస్తుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజల సమస్యలు తీరాలంటే టిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేసి వచ్చే ఎన్నికలలో కెసిఆర్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నాను ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నార్సింగి సర్కిల్ పార్టీ అధ్యక్షుడు కే విష్ణువర్ధన్ రెడ్డి, రాజేందర్, గణేష్ రెడ్డి, గణేష్ ముదిరాజ్, డాక్టర్ సాబ్, ఆనంద్, నరసింహ, పారుక్ నరసింహ, నిజాముద్దీన్, చిరంజీవి, మల్లేష్, శ్రీకాంత్ రెడ్డి, రవి యాదవ్, ప్రవీణ్, శ్రీనివాస్, వెంకటేష్, కాంతి, వినోద్, మైపాల్, నరసింహ రాజు, సంతోష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత విద్యలో మరింత రాణించాలి

- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్, మే 15(ప్రజాక్షేత్రం):**

రానున్న ఉన్నత విద్యలో విద్యార్థులు మరింత రాణించాలని స్థానిక ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ఆకాంక్షించారు. శనివారం శంషాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలల దీటుగా చదివి మంచి ఫలితాలను సాధించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య వ్యవస్థ పై దృష్టి సారించి విద్యార్థులకు కావలసిన సదుపాయాలను కల్పిస్తుందని ఆయన తెలిపారు. విద్యార్థులకు విద్యా బోధనలను అందించి మరింత ఉత్తీర్ణత శాతాన్ని ప్రతి పాఠశాలలో పెంపొందించాలని ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సూచించారు. విద్యా వ్యవస్థను సీఎం రేవంత్ రెడ్డి మరింత పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. మండలంలోని మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించిన నర్కూడ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాములు నాయక్, మండల అధికారి మున్ని, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## యువ శౌర్య సేన ఆధ్వర్యంలో గోవులకు గో గ్రాసం సేవా కార్యక్రమం

**శంకర్ పల్లి మే 16(ప్రజాక్షేత్రం):**

కార్వాన్ రాధాకృష్ణ గోశాలలో సుమారు 40 గోవులు ఉండగా, వేసవి తీవ్రత, అధిక ఉష్ణోగ్రతలు మరియు వేడి గాలుల కారణంగా అవి వడదెబ్బతో అనారోగ్యానికి గురవుతున్నాయని గుర్తించిన యువ శౌర్య సేన సభ్యులు గోశాలకు పశుగ్రాసాన్ని అందించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మరియు వ్యవస్థాపకుడు రవీందర్ లంటు యాదవ్ మాట్లాడుతూ, ఆవు మనకు అమృతసమానమైన పాలను అందించే ప్రశాంత స్వభావం గల జంతువని తెలిపారు. ఆవుపాల నుండి పెరుగు, వెన్న, నెయ్యి, మజ్జిగ వంటి ఆరోగ్యకరమైన పదార్థాలు తయారవుతాయని చెప్పారు. ఆవు నెయ్యి ఆయుర్వేదంలో అనేక వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుందని వివరించారు. అలాగే ఆవు పేడ, మూత్రం సహజ ఎరువులుగా ఉపయోగపడుతూ భూమిని సారవంతం చేస్తాయని, రసాయన పురుగుమందులకు బదులుగా వీటిని ఉపయోగించడం ద్వారా ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతిలో ఆవును "గోమాత"గా భక్తితో పూజిస్తారని, శ్రీకృష్ణుడు గోపాలుడిగా వర్ణించబడిన విషయాన్ని గుర్తుచేశారు. గోమాతను పూజించడం అంటే ప్రకృతిని పూజించినట్లేనని, అందరూ కలిసి గోమాత సంరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు పి. గంగాధర్, జాయింట్ సెక్రటరీ ఉష, సభ్యులు దస్తప్ప, విశాల్ చారి, గోశాల నిర్వాహకులు నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కంపు కొడుతున్న తాండూర్ ఆర్టీసీ బస్ స్టాండ్

- **పట్టించుకోని కాంట్రాక్టర్, డిపో అధికారి**
- **నిమ్మకు నిరీత్తినట్లు వ్యవహరిస్తున్న ఆర్టీసీ ఉన్నతధికారులు.**

**తాండూర్ మే 16(ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా తాండూర్ ఆర్టీసీ బస్ స్టాండ్ ఆవరణలో కంపు వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, బస్సుల కోసం నిరీక్షిస్తూ బస్ స్టాండ్ లో కూర్చుంటే, మల మూత్రం వాసనతో తట్టుకోలేక పోతున్నామని వివిధ గ్రామాల ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారి తాండూర్ డిపో మేనేజర్ వచ్చి బస్టాండ్ లో కూర్చుంటే ఎంత గలీజ్ వాసన వస్తుందో తెలుస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు డ్రైవర్ లు, కండక్టర్ లు కూడా పలుమార్లు ఇట్టి విషయంపై మీడియా దృష్టికి తీసుకువచ్చారు. దయచేసి ఇప్పటికైనా డిపో అధికారి, సంబంధిత బాత్ రూమ్ కాంట్రాక్టర్ తో చర్చించి, బస్ స్టాండ్ లో దుర్వసన వెలువడకుండా, శుభ్రంగా ఉంచేలా చూడాలని, తాండూర్ నియోజకవర్గం ప్రజలు ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు, బాత్రూం కాంట్రాక్టర్ బస్టాండ్ లో ఒక షాప్ ని ర్వహిస్తున్నాడు, మొత్తం షాప్ దగ్గరనే ఎక్కువ సమయం కేటాయిస్తున్నాడని, బాత్రూం లను పట్టించుకోవడం లేదని, బాత్రూం వెళ్లే వాళ్ళ దగ్గర 10 రూపాయలు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వెలువడుతున్నాయి, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్ స్టాండ్ లలో బాత్ రూమ్ లకు ఫ్రీ అని,ఎలాంటి రుసుం తీసుకోవద్దని ప్రభుత్వం నిర్ణయించింది. బాత్ రూమ్ కాంటాక్టర్ తన పనితీరు మార్చుకోలేని పక్షంలో ఆర్టీసీ ఎండికి, జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేస్తామని ప్రయాణికులు హెచ్చరించారు.




## షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న బస్తాలు దహనం

**బోధన్, నిజామాబాద్ జిల్లా, మే 16(ప్రజాక్షేత్రం) :**

సాలూర మండలం జాడిజమల్పూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకున్న ప్రమాదంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ రైతు కష్టమంతా అగ్నిపాలైంది. బాధిత రైతు ఆలూరి రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. రేయింబవళ్లు కష్టపడి సాగు చేసిన మొక్కజొన్న పంటను ఇటీవల కోత కోసి, విక్రయించడానికి సిద్ధంగా ఉంచారు. శనివారం ప్రమాదవశాత్తు ఒక్కసారిగా అక్కడ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి నిప్పురవ్వలు ఎగసిపడటంతో నిమిషాల వ్యవధిలోనే మొక్కజొన్న బస్తాలన్నీ మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలిబూడిదయ్యాయి. చేతికందివచ్చిన పంట అమ్ముదామనుకునే లోపే కంటిముందే సర్వనాశనం కావడంతో తాను కోలుకోలేని విధంగా నష్టపోయానని బాధిత రైతు కన్నీరుమున్నీరయ్యాడు. అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టానని, ఇప్పుడు చేతిలో చిల్లిగవ్వ లేక కుటుంబం రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాలని, తగిన నష్టపరిహారం అందించి తనను ఆర్థికంగా ఆదుకోవాలని కొరారు.



# మారని ప్రభుత్వాసుపత్రుల పనితీరు....!

- **గర్భిణీల ప్రాణాలతో వైద్య సిబ్బంది చెలగాటం..!**
- **షాద్ నగర్, తాండూరు, వికారాబాద్, పరిగి ప్రభుత్వ ఆసుపత్రుల్లో వరుస ఘటనలు**
- **గతంలో వికారాబాద్ ఆసుపత్రిలో క్యాండిల్ వెలుతురుతో ఆపరేషన్**

మొన్న వికారాబాద్ నిన్న షాద్ నగర్ నేడు తాండూర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో లక్ష్యం కొట్టొచ్చిన కనిపిస్తుంది. గత కొన్ని రోజుల క్రితం వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాండిల్ పెడుతులతో వైద్యులు ఓ వ్యక్తికి ఆపరేషన్ చేశారంటే ఎంత నిర్లక్ష్యం ఇట్టే అర్థమవుతుంది. ప్రసవించిన ఓ మహిళ విషయంలో కడుపులోని కాటన్ ఉంచిన వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై మూడు నెలల పాటు నరకయాతన అనుభవించిన సంఘటన మరువకముందే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని ప్రభుత్వ మాతా శిశు సంరక్షణ ఆసుపత్రిలో కూడా మరో మహిళ పట్ల ఇదే సంఘటన ఎదురయింది. వారం వ్యవధిలో రెండు ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ వైద్య సేవలు ప్రతిష్టపాలు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో సంఘటన జరిగాక వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దీనిపై ఎలాంటి విచారణ విషయంలో వెంటనే స్పందించకపోవడం పట్ల జనాల్లో ప్రభుత్వ వైద్యం పట్ల నిరాసక్తి కలుగుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల పర్యవేక్షణ లోపించింది. డెలివరీ కోసం వచ్చే గర్భిణీల ప్రాణాలతో వైద్య సిబ్బంది చెలగాటం ఆడుతున్నారు. తాజాగా జరుగుతున్న పరిణామాలలో వైద్యులు చేసిన నిర్లక్ష్యం వారి ప్రాణాల మీదకు తెచ్చింది. అసలేం జరిగిందంటే..? రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో భవ్య అనే 27 సంవత్సరాల మహిళ గత ఫిబ్రవరి 7న ఆస్పత్రిలో ప్రసవం కోసం వచ్చింది. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించిన అనంతరం ఒక మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు సాధారణ ప్రసవం కాక రక్తస్రావం కాకుండా వైద్య సిబ్బంది భవ్య వజైనలో కాటన్ బట్టను పెట్టి మర్చిపోయారు. అయితే మూడు నెలలుగా భవ్య తీవ్ర కడుపునొప్పి రక్తస్రావంతో బాధపడుతోందనీ ఆమె అత్త నిర్మలమ్మ వైద్యుల ముందు వాపోయారు. అయితే ఏంటి బేటిక్ ఇతర పెయిన్ కిల్లర్స్ మందులు రాసి ఇచ్చారు. భవ్యకు ఎం జరిగింది? ఎవరు కనీసం ఆమె చేయి పట్టుకుని పరీక్షించలేదు. కేవలం మందులు రాసి మాత్రమే పంపించారు. దీంతో వారు మూడు నెలల పాటు అనేక ఇబ్బందులు ఎదుర్కొని ప్రభుత్వ వైద్య సేవల పట్ల నిరాసక్తి వ్యక్తం చేశారు. ఇంతకు కడుపునొప్పి తగ్గకపోవడంతో మరో మహిళా డాక్టర్ ను ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఆమె ద్వారా భవ్యను పరీక్షించి ఆమె కడుపు ఒజైనాలో ఉన్న కాటన్ వస్త్రాన్ని బయటకు లాగి పడేశారు. ఇంత నిర్లక్ష్యం నిర్లిప్తత ఎందుకని బాధితురాలి అత్త నిర్మలమ్మ వైద్య శాఖలోని సిబ్బందిని ప్రశ్నిస్తుంటే చర్యలు తీసుకోవడానికి కానీ లేదా వారికి తగిన సమాధానం చెప్పడానికి వైద్య సిబ్బంది సిద్ధంగా లేరని ఆమె వాపు అవుతుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో జాబుదారితనం లేకపోవడం ఏమిటని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది. సంఘటన జరిగి ఇన్ని రోజులు గడుస్తున్నప్పటికీ తన ఫిర్యాదులు కూడా స్వీకరించడం లేదని ఫిర్యాదు ఇవ్వడానికి వస్తే అధికారులు పట్టించుకోవడంలేదని తనను పంపించేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన జరిగి మీడియాలో అనేక కథనాలు వస్తున్నప్పటికీ ఇప్పటివరకు అధికారులు మీడియాకు కూడా ముఖం చాటేశారు. జరిగిన విషయంపై వివరణ కూడా ఇచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారంలో బాధితులదే తప్పు అన్న విధంగా వైద్య సిబ్బంది కొత్త విషయాన్ని క్రియేట్ చేసి పట్టించుకోవడంలేదని సాదాసీదాగా ఈ విషయాన్ని కొట్టిపారేస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

**కాటన్ ఉంచి.. కుట్లు వేసేశారు !**

**తాండూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం**

**కాన్పు అయిన మహిళకు తీవ్ర అస్వస్థత**

వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నావాల్గకు చెందిన గర్భిణి ఆర్తి ఈ నెల 3న తాండూరు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది. అదే రోజు ఆమెకు సాధారణ ప్రసవం కాగా రక్తస్రావం కాకుండా వైద్యులు కాటన్ ఉంచి కుట్లు వేశారు. అనంతరం దానిని తొలగించకుండా ఆమెను ఇంటికి పంపించేశారు. ఈ క్రమంలో బాధిత మహిళ తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో శుక్రవారం కుటుంబ సభ్యులు ఆమెను మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చి వైద్య సిబ్బందిని నిలదీ శారు. ఆర్తి ఆరోగ్య పరిస్థితిని గమనించిన ఆర్ఎంఓ డాక్టర్ అనిల్ కుమార్ అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్కు తరలించారు. ఆగ్రహించిన బాధితురాలి బంధువులు డాక్టర్ స్నేహ, మంజులపై చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. సీఎం సొంత జిల్లాలో కూడా వైద్య సేవల పట్ల పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు..

**పేద ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వైద్య సిబ్బంది**

**తక్షణమే ఆ వైద్యులను వైద్యశాఖ అధికారులు విధుల నుండి సస్పెండ్ చేయాలి**

**తెలంగాణ రక్షణ సేవ ముస్లిం మైనార్టీ నాయకులు ఎండి ముస్తఫా, సిపిఎం నాయకులు వెంకటయ్య తో పాటు ప్రజా సంఘాల డిమాండ్**

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో దారుణం కను విప్పు కానీ ప్రభుత్వ అధికారులు పేదవారిపై ఎందుకింత నిర్లక్ష్యం అని పలువురు ప్రజాసంఘాల డిమాండ్ ప్రశ్నిస్తున్నాయి. షాద్ నగర్ పట్టణంలో ఫరూక్ నగర్ ప్రాంతంలో నివసిస్తున్న భవ్య ఆసుపత్రిలో మగ బిడ్డకు జన్మనిచ్చింది ఆ తర్వాత ఇంటికి వెళ్ళింది భవ్యకు ఆ క్షణం నుండి కడుపునొప్పి ప్రారంభమైంది రోజులు గడిచే కొద్దీ నొప్పి తో పాటు రక్తస్రావం బ్లీడింగ్




కూడా మొదలైంది. దీనిపై మళ్లీ ప్రభుత్వ ఆసుపత్రికి సంప్రదించగా వారి కేవలం మందులు రాసి ఇచ్చారు ఆ మందులు వాడిన నొప్పి తగ్గిన తగ్గకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రి కూడా చూపించారు ఎంతమంది వైద్యులు చూపించిన స్కానింగ్ చేయించిన అసలు విషయం బయటకు పడలేదు ఇలా సుమారు మూడు నెలల పాటు ఆమె తీవ్రమైన నరకాయాత్ర అనుభవించింది వైద్యుల నిర్లక్ష్యం బయటపడింది ఎలా ఆమె మే 9వ తేదీ తమకు పరిచయం ఉన్న ఒక మహిళ డాక్టర్ను బాధితురాలు సంప్రదించింది సదరు డాక్టర్ భవ్యకు శూన్యంగా పరిశీలించి గర్భసంచిలో కాంతి సమయంలో వదిలేసిన ప్లాట్ బయట పడింది ప్యాడ్ లోపల ఉండి పోవడంతో పూర్తిగా పాడైపోయిన దుర్వాసనపై బయటకు రావడం కుటుంబ సభ్యులు మరియు డాక్టర్ నిర్లక్ష్యానికి మరికొన్ని రోజులు ఆలస్యమై ఉంటే కడుపులో ఇన్ఫెక్షన్ చోకి చనిపోయే ప్రమాదం ఉండేదని చెప్పవచ్చును సిబ్బంది ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారు అనే దానిపైన వివరించుకోవాలి . మొన్న భవ్య నేడు ఆర్తి బషీరాబాద్ మండలం నామంగి గ్రామానికి చెందిన ఆర్తి అనే గర్భిణీ తన మొదటి ఖాన్పు కోసం మే 3న భర్త రమేష్ తో కలిసి తాండూర్ మాతా శిశు ఆసుపత్రిలో చేరింది ఆమెకు వైద్యులు నార్మల్ డెలివరీ చేశారు బాబు పుట్టాడు అయితే మొదటి కాన్పు కావడంతో కాన్పు సమయంలో కడుపు లోపల కాటన్ పత్తి పెట్టేసి అలాగే కుట్లు వేశారు రంగారెడ్డి జిల్లాలో వికారాబాద్ జిల్లాలో వైద్యుల నిర్లక్ష్యాలు ప్రాణాలతో చెలగాట్లు మారుతున్నటువంటి ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన వారం రోజుల తర్వాత ఆర్తి తీవ్రమైన అనారోగ్యానికి గురైంది దీంతో ఆమె అత్తవారిల్లు ఉన్న కర్ణాటకలో కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లగా అక్కడ స్థానిక వైద్యులు పరీక్షించారు వైద్యుల నిర్లక్ష్యం కారణంగా లోపల కాటన్ నుంచి కుట్లు పేడం వల్ల తీవ్రమైన ఇన్ఫెక్షన్ సోకింది వారు నిర్ధారిచ్ఛద్దింతో అక్కడ వైద్యులు లోపాల ఉన్న కాటన్ తొలగించారు ఇన్ఫెక్షన్ తీవ్రం కావడంతో తీవ్రమైన జ్వరము విపరీతంగా రావడంతో బాధితులు మళ్లీ తాండ ప్రభుత్వాసుపత్రికి వచ్చారు అక్కడ చేరిన 48 గంటలు గడిచిన పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో జ్వరం తగ్గట్టుకోవడంతో దీంతో అక్కడి వైద్యులు బాత్యాహితంగా వ్యవహరిస్తూ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తీసుకు వెళ్ళమంటూ ఉచిత సలహాలు ఇచ్చి చేతులు వచ్చేశారు గత్యంతరమైన పరిస్థితిలో బాధితులు ఆర్తిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు ఇందుకు ఇలా జరుగుతుంది ప్రభుత్వం ఆస్పత్రుల్లో ఇలా జరగడానికి గల కారణమేమిటి వారి ఆలోచన విధానం ఏమిటి? ఇలాంటి పేదవారుకు తినసీకే లేకపోవడం ఆర్థిక స్థితిగతు సరిగా లేకపోవడం ఇవన్నీటికి కారణము ప్రభుత్వ అధికారుల లేకపోతే ప్రజలతో ప్రాణాలు చెలగాటమాడుతున్నట్టు వైద్య సిబ్బందిదా ఇప్పటికైనా కళ్ళు తెరుస్తుందా వైద్య అధికారుల బృందం లేకపోతే పేదవారి ప్రాణాలతో చెలగాటమాడుతుందా ఇప్పటికైనా మారాలి ప్రభుత్వము వైద్య ఆరోగ్యం పై ఇలా జరిగినటువంటి ఘటనపై తీవ్రంగా ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి ఇలాంటి నిర్లక్ష్య ధోరణికి ఈనాటి ప్రభుత్వం సమాధానం చెప్పవలసిన అవసరం ఉంది ఆరోగ్యశాఖ మంత్రివర్యులు కూడా దీనిపై వెంబడి స్పందించి అధికారులని బర్తరఫ్ చేయవలసిన అవసరం ఉంది పేదవారితో ప్రాణాలతో చెలగాటమాడుతున్నటువంటి వైద్య సిబ్బంది ఇప్పటికైనా కళ్లు తెరిచి తమ యొక్క ఆలోచన విధానాన్ని కన్ను తెరిస్తే బాగుంటుందని ప్రజా సంఘాల యొక్క అభిప్రాయం ఇప్పటికీ మారని కూడా వైద్య సిబ్బంది తీరు మారేదేలా మారుపొచ్చేదేలా దీనికి కారణము అధికారుల లేకపోతే ప్రజల స్పందించవలసిన అవసరం ఎంతగానో ఉంది ఇప్పటికైనా వైద్య వైద్య అధికారుల నిర్లక్ష్య ధోరణికి ఉదాహరణ అని చెప్పవచ్చును ఇలాంటి ఘటనలు ఎన్ని జరిగినా పట్టించుకోని ప్రభుత్వం ఇప్పటికైనా కన్ను తెరవాలని ఆశిస్తున్నాం..



**ఎం. రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**

## కృత్రిమ మేధస్సు (ఏఐ) మరియు భవిష్యత్ అవకాశాలపై అవగాహన కార్యక్రమం

- **ప్రజాపాలనలో భాగంగా 6వ రోజు ఆమనగల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి**



**ఆమనగల్, మే 17(ప్రజాక్షేత్రం):**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 6వ రోజు సందర్భంగా అమంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధస్సు (AI) మరియు దాని భవిష్యత్ అవకాశాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం విజయవంతంగానిర్వహించబడింది.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు మరియు సిబ్బందికి కృత్రిమ మేధస్సు విద్య, ఉపాధి, పరిశోధన మరియు దైనందిన జీవితంలో ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నదో వివరించబడింది. వైద్య రంగం, బ్యాంకింగ్, వ్యవసాయం, విద్య, పాలన, పరిశ్రమలు వంటి అనేక రంగాల్లో AI ఎలా మార్పులు తీసుకొస్తుందో వివరిస్తూ, విద్యార్థులు భవిష్యత్తుకు సిద్ధంగా ఉండేందుకు డిజిటల్ నైపుణ్యాలు మరియు AI సంబంధిత జ్ఞానం పొందాల్సిన అవసరాన్నితెలియజేశారు. వనరుల వ్యక్తి AI యొక్క ప్రాథమిక అంశాలు, ప్రస్తుత వినియోగాలు, ఉపాధి అవకాశాలు, మరియు అకాడెమిక్ మరియు పరిశోధనలో AI సాధనాల ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు ప్రాజెక్ట్ పనులు, డేటా విశ్లేషణ, కంటెంట్ తయారీ, సమస్యల పరిష్కారంలో AI ఉపయోగాల గురించి అవగాహన కల్పించారు. AI ను నైతికంగా మరియు బాధ్యతాయుతంగా ఉపయోగించే విధానాలపై కూడా దృష్టి పెట్టారు ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులకు నూతన సాంకేతికతలను అర్థం చేసుకోవడంలో మరియు భవిష్యత్ ఉపాధి అవకాశాలకు సిద్ధం కావడంలో ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అధ్యాపకులు AI ఆధారిత ఆన్‌లైన్ కోర్సులు మరియు ప్లాట్‌ఫార్మ్‌లను ఉపయోగించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అనేక మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, AI వినియోగాలు మరియు ఉపాధి అవకాశాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.చివరగా, కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలపై అవగాహన కల్పించేందుకు కళాశాల కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు నవనీత, శ్రీవాణి, గోపాల్ రాజు మరియు హరీష్ విద్యార్థులకు తమ సూచనలు అందించారు.

## క్రీడలతో యువతకు క్రమశిక్షణ, ఆరోగ్యం

- **క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పినెముల మహిపాల్ రెడ్డి**

**పెద్దేముల్, మే 16(ప్రజాక్షేత్రం):**



క్రీడలు యువతకు క్రమశిక్షణ, ఆరోగ్యాన్ని అందిస్తాయని పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పినెముల మహిపాల్ రెడ్డి, పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ లు అన్నారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో (పెద్దేముల్ ప్రీమియర్ లీగ్)PPL సీజన్4 క్రికెట్ టోర్నమెంట్‌ను పెద్దేముల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పినెముల మహిపాల్ రెడ్డి, స్థానిక ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్, పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై చిన్న నర్సింహులు, ఉప సర్పంచ్ డివై ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జితేందర్ రెడ్డి(దొర) లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.... క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యతా భావం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని, యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న జట్లకు క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు.మహిపాల్ రెడ్డి కుమారుడు పినెముల శౌర్యన్ రెడ్డి ఆయా జట్ల క్రీడాకారులకు షేక్ హ్యాండ్ ఇస్తూ "ఆల్ ది బెస్ట్" చెబుతూ క్రికెట్ జట్ల క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ ఏకంగా స్థానిక యువకులతోపాటు కలిసి ఓ జట్టులో టీమ్ మెంబర్ గా క్రికెట్ ఆడి పెద్దేముల్ గ్రామ యువకుల్లో క్రికెట్ క్రీడ పట్ల ఉత్సాహన్ని నింపారు.మరోవైపు పినెముల మహిపాల్ రెడ్డి, పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పెండ్యాల ప్రవీణ్ కుమార్ గుప్తా,ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్ లు చాలా సేపు టోర్నమెంట్ లో భాగంగా కొనసాగుతున్న క్రికెట్ మ్యాచ్ లను తిలకించారు. ఈ కార్యక్రమంలో (పెద్దేముల్ ప్రీమియర్ లీగ్ )PPL సీజన్4 క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు పరియాద అరుణ్, అంబి, శివ, పినెముల మహిపాల్ రెడ్డి కుమారుడు పినెముల శౌర్యన్ రెడ్డి,పెద్దేముల్ గ్రామ ఆయా జట్ల క్రీడాకారులు, స్థానిక యువకులు, క్రికెట్ అభిమానులు, చిన్నారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394